పవిత్ర రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ పవిత్ర మాసం సహనం, త్యాగం, దయ, మానవత్వానికి ప్రతీక. క్రమశిక్షణతో ఉపవాసాలు చేసిన ప్రతి ఒక్కరికి అల్లాహ్ ఆశీస్సులు లభించి, మీ జీవితాల్లో శాంతి, సుఖసంతోషాలు నిండాలని ఆకాంక్షిస్తున్నాను.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

శనివారం 21.03.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 333 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

- విద్యాసంస్థలు, ఆలయాలకు తొలి ప్రాధాన్యత
- అంతర్జాతీయ ఉద్రిక్తతల వేళ అధికారులకు కీలక ఆదేశాలు
- వారంలోగా విశాఖకు గ్యాస్ నౌక
- పీఎన్‌జీ దిశగా అడుగులు: గ్యాస్ కష్టాలకు శాశ్వత పరిష్కారం వైపు ప్రభుత్వం!
- గిరిజన, గ్రామీణ ప్రాంతాలకు 'కిరోసిన్' భరోసా: సోమవారం నుంచే పంపిణీ
- బ్లాక్ మార్కెట్‌పై ఉక్కుపాదం: 9 గ్యాస్ ఏజెన్సీలపై సర్కార్ వేటు

## గ్యాస్ సంక్షోభంపై చంద్ర 'వ్యూహం'



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఎల్పీజీ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వొద్దని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఉండవల్లి సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎల్పీజీ సరఫరాపై సమీక్షించారు. ఇరాన్ – ఇజ్రాయిల్, అమెరికా మధ్య మరి కొన్నాళ్లు యుద్ధం కొనసాగితే ఎల్పీజీ గ్లోబల్ సప్లయ్ చైన్ దెబ్బతినే అవకాశం ఉందని, ఆ సంక్షోభాన్ని ఎదుర్కొనేలా రాష్ట్రంలో సమర్ధవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులకు చంద్రబాబు దిశానిర్ధేశం చేశారు.

ఎక్కడా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వకుండా చూడాలని సూచించారు. గ్రామీణ – గిరిజన ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆలయాలు, అన్న క్యాంటీన్లు, అంగన్వాడీలకు గ్యాస్ డెలివరీలో ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్జీ వంటి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎరువులు, పెట్రోల్, డీజిల్‌కు లోటు రానివ్వకుండా కేంద్రంతో సంప్రదింపులు జరపాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు.

**ఎల్పీజీ సరఫరాపై కేంద్రంతో మాట్లాడాం:** రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరా, కొరతపై ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తున్నారని, ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ కింద గ్యాస్‌ను చేర్చిన తర్వాత బుకింగ్స్ ఒక్కసారిగా పెరిగాయని ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా 3.54 లక్షల బుకింగ్స్ నమోదు కాగా, ప్రస్తుతం ఆ సంఖ్య 2.96 లక్షలకు తగ్గిందని ప్రజల్లో అవగాహన పెరుగుతోందని అన్నారు. ప్రస్తుతం బుక్ చేసుకున్న 2.96 లక్షల మందిలో ఇప్పటికే 2.72 లక్షల మందికి గ్యాస్ డెలివరీ పూర్తయిందని తెలిపారు.

హార్మూజ్ జలసంధి వద్ద యుద్ధ ఉద్రిక్తతల వల్ల విశాఖపట్నానికి ఈ నెల 21న రావాల్సిన గ్యాస్ నౌక, 26వ తేదీన చేరుకోనుందని కేంద్రం సమాచారం ఇచ్చిందన్నారు. మిగతా 2లో...

## అకాల వర్షం.. అండగా ప్రభుత్వం



- రెండు రోజుల్లో పంట నష్టంపై పూర్తి నివేదిక సమర్పించండి
- ఎల్పీజీ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వొద్దు
- అకాల వర్షాలు, గ్యాస్ సరఫరాపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- ఇప్పటివరకు పంట నష్టాన్ని రూ.63 కోట్లుగా లెక్కించిన అధికారులు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** భారీ గాలులు, అకాల వర్షాలు, వడగళ్లతో రాష్ట్రంలో సంభవించిన పంట నష్టంపై రెండు రోజుల్లో పూర్తి స్థాయి అంచనాలు రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. దీనిపై శుక్రవారం క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 12 జిల్లాల్లోని 42 మండలాల్లో 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటలకు నష్టం వాటిల్లిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వీటి విలువ రూ. 40 కోట్లుగా లెక్కగట్టారు. అలాగే 9 జిల్లాల్లోని 48 మండలాల్లో 1,301 హెక్టార్లలో ఉద్యాన పంటలపైనా వర్షాలు ప్రభావం చూపాయన్నారు. అరటి, బొప్పాయి, మిరప, కూరగాయలు, మామిడి, ఆరెంజ్, నిమ్మ పంటలు దెబ్బతినగా... నష్టం విలువ రూ. 23 కోట్లుగా అంచనా వేశారు. ఇప్పటివరకు వేసిన అంచనాల ప్రకారం అన్ని పంటలకు కలిపి మొత్తం నష్టం రూ. 63 కోట్లుగా అధికారులు లెక్క తేల్చారు. మిగతా 2లో...

## మౌనం వీడిన విజయమ్మ



**కడప(జర్నలిస్ట్ ఫైల్) :** కుటుంబ ఆస్తుల పంపకాలపై నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో వివాదం కొనసాగుతున్న వేళ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ సతీమణి విజయమ్మ మీడియాకు అడ్వకేట్ నోటరీ విడుదల చేశారు. వైకాపా నేతలు చేస్తున్న ఆరోపణలపై అందులో పూర్తిస్థాయి స్పష్టత ఇచ్చారు. ఆస్తుల విషయంలో చెల్లెలు, ఆమె పిల్లలకు జగన్ అన్యాయం చేశారని అన్నారు. ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగలేదని, వైఎస్ మరణించే వరకు ఉన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులేనని ఆమె అన్నారు.

" తన ఆస్తులన్నీ నలుగురు మనవలు, మనవరాళ్లకు సమానంగా పంచాలని వైఎస్ఆర్ ఉద్దేశం. ఇది ఆయన ఆదేశం కూడా. దగ్గర వాళ్లందరికీ తెలిసిన వాస్తవమిది. ఎంవోయూలో షర్మిలకు రాసిన ప్రతి ఆస్తి న్యాయంగా ఆమెకు దక్కాల్సిందే. షర్మిల హక్కుకు అనుగుణంగానే జగన్ ఎంవోయూ రాశాడు. వాస్తవానికి షర్మిలకు చెందాల్సిన దానికంటే తక్కువే రాశాడు. సరస్వతి సిమెంట్ సహా యెలహంక భూమి కూడా షర్మిలదే. షర్మిలకు ఇప్పటి వరకు ఇచ్చానని చెబుతున్న డబ్బంతా డివిడెండ్ మాత్రమే. ఆస్తుల విషయంలో జగన్ తన మేనల్లుడు, మేనకోడలికి ఇప్పటివరకు అన్యాయం చేశాడు. ఇప్పటికైనా న్యాయం చేస్తాడని తల్లిగా ఆశిస్తున్నాను. నిజం ఏమిటో దేవుడికి, నా కొడుక్కి కూడా తెలుసు. దేవుడి సాక్షిగా నేను రాసినవన్నీ వాస్తవాలు మాత్రమే" అని ఆమె పేర్కొన్నారు.

## భక్తుల విశ్వాసం.. నమ్మకానికి భరోసా

- తిరుమలలోనే ప్రసాదాల కల్తీని గుర్తించే అత్యాధునిక స్టేట్ ఫుడ్ ల్యాబ్ సిద్ధం!
- దేశంలోని పుణ్యక్షేత్రాల్లో ఏర్పాటు కావడం ఇదే తొలిసారి
- నేడు సీఎం చంద్రబాబుచే ప్రారంభం
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలలో సిద్ధమైన స్టేట్ ఫుడ్ ల్యాబరేటరీని ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ప్రారంభించనున్నారు. శ్రీవారి లడ్డూ, అన్న ప్రసాదాల్లో నాణ్యత, స్వచ్ఛత, నెయ్యి, నూనె, పాలు, ఇతర ముడిసరకుల్లో సూక్ష్మ స్థాయిలో కల్తీ జరిగినా పసిగట్టే పరీక్షలు ఈ అత్యాధునిక ల్యాబ్ లో జరుగుతాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడొక ప్రకటనలో తెలిపారు. పుణ్య క్షేత్రాల్లో ఈ తరహా ఫుడ్ లేబరేటరీ ఏర్పాటు కావడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. నూనె, పాలు, నెయ్యిలో ఫెస్టిసైడ్స్, ప్రిజర్వేటివ్స్ వంటి అవశేషాలను కూడా ఈ ల్యాబ్ లో గుర్తిస్తారని తెలిపారు. కెమికల్ ఎనాలిసిస్, మైక్రోబయాలజీ ఎనాలిసిస్ పరీక్షలకు అనుగుణంగా పరికరాలు/యంత్రాలను ల్యాబ్ లో సమకూర్చామని పేర్కొన్నారు.

మంత్రి సత్యకుమార్ చొరవతో కుదిరిన **ఒప్పందాన్ని అనుసరించి..! :** మంత్రి సత్యకుమార్ సమక్షంలో అక్టోబర్ 8, 2024న ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్‌ఎస్ఎఐ)తో న్యూఢిల్లీలో రాష్ట్ర అధికారులు చేసుకున్న ఒప్పందాన్ని అనుసరించి తిరుమలలో 12వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రత్యేకంగా ఫుడ్ ల్యాబరేటరీ ఏర్పాటైంది. పలు పుణ్యక్షేత్రాల్లో ల్యాబ్స్ ఏర్పాటుపై ఎఫ్ఎస్ఎస్ఏఐతో సదరు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చర్చలు జరిగినా కార్యాచరణ మాత్రం తిరుమలతోనే సాధ్యమైంది.

**9 నెలలకు... :** కిందటేడాది జూన్ 1 నుంచి ప్రారంభమైన ల్యాబ్ ఏర్పాటు పనులు ఇటీవలే పూర్తయ్యాయి. రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కార్ల భాగస్వామ్యంతో తితిదే సహకారంతో ఈ ల్యాబరేటరీ ఏర్పాటుకు ఒడిఒడిగా అడుగులుపడ్డాయి. గతంలో చోటుచేసుకున్న కల్తీ ఘటనలు దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా తిరుమలలో ల్యాబ్‌కు సుమారు రూ. 25 కోట్ల వం-కు వ్యయమవుతోంది. టీటీడీ స్థలానివ్వగా.. కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చింది.

ఇందులో సుమారు రూ. 10 కోట్లతో అత్యాధునిక పరికరాలను ల్యాబ్ లో సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. ల్యాబ్ కూ ట్రాన్సఫార్మర్, జనరేటర్ సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. - 2లో...

## లోపలి పేజీల్లో

### 'బాబుతోనే జాబు'ను నిజం చేస్తున్నాం



- ఏటా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు
- ఉగాది సందర్భంగా జాబ్ క్యాలెండర్ విడుదల
- మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్
- గతేడాది మెగా డీఎస్సీతో 16 వేల టీచర్ పోస్టుల భర్తీ
- 6 వేలకు పైగా పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకం
- 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కట్టుబడి ఉన్నాం
- మాట తప్పిన జగన్... హామీని నిలబెట్టుకున్న లోకేశ్
- ఉద్యోగాల భర్తీ అంటూ యువతకు జగన్ మోసం : మంత్రి సవిత

**సోమందేపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** బాబుతోనే జాబు గ్యారంటీ అనే నినాదాన్ని నిజం చేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగ యువతను జగన్ మోసం చేస్తే, టీచర్, పోలీసు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి మంత్రి నారా లోకేశ్ మాట నిలబెట్టుకున్నారని కొనియాడారు.

## భద్రాచలంలో విషాదం



**భద్రాచలం (జర్నలిస్ట్ ఫైల్) :** భద్రాచలం శివారులో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గోదావరి నదిలో స్నానానికి వెళ్లిన యువకుల్లో ఐదుగురు గల్లంతు కావడంతో స్థానికంగా తీవ్ర ఆందోళన నెలకొంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పురుషోత్తమపట్నం పంచాయతీ పరిధిలోని కొల్లుగూడెం సమీపంలో ఈ ఘటన జరిగింది. భద్రాచలం పట్టణానికి చెందిన ఏడుగురు గోదావరిలో స్నానానికి వెళ్లగా, వారిలో ఐదుగురు లోతు తెలియక నదిలో మునిగిపోయినట్లు సమాచారం.

ఒడ్డున ఉన్న ఇద్దరు వెంటనే డయల్ 100కు సమాచారం అందించగా, పోలీసులు అప్రమత్తమయ్యారు. ఘటన స్థలం ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉండటంతో భద్రాచలం పోలీసులు ఎటపాక పోలీసులకు సమాచారం ఇచ్చారు.

భద్రాచలం, ఎటపాక పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

### దేశవ్యాప్తంగా సరిపడా

## ఎల్పీజీ వంటగ్యాస్ నిల్వలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజలు ఆందోళనతో ఎల్పీజీ వంటగ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకోవడం తగ్గిపోయిందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ వెల్లడించింది. గురువారం రోజు కేవలం 55 లక్షల ఎల్పీజీ సిలిండర్లనే బుక్ చేసుకున్నారని తెలిపింది. శుక్రవారం కేంద్ర మంత్రిత్వ శాఖల సంయుక్త విలేకరుల సమావేశంలో ఈవివరాలను పెట్రోలియం, సహజ వాయువు శాఖ జాయింట్ సెక్రెటరీ సుజాత శర్మ చెప్పారు. దేశవ్యాప్తంగా ఎల్పీజీ వంటగ్యాస్ సిలిండర్ల సప్లైలో ఎలాంటి కొరతా లేదని ఆమె తేల్చి చెప్పారు. భారతదేశ అవసరాలకు సరిపడా ఎల్పీజీ వంటగ్యాస్ నిల్వలు ఉన్నాయని, ఏ ఒక్క వంటగ్యాస్ సప్లై ఏజెన్సీలోనూ స్టాక్ అయిపోవడం అనేది జరగలేదన్నారు. అయితే ఇప్పటికీ ఎల్పీజీ అంశం కొంత ఆందోళనకరంగానే ఉందని సుజాత శర్మ పేర్కొన్నారు. మిగతా 2లో...

### పశ్చిమాసియా గగనతలంపై

## డీజీసీఏ కఠిన నిబంధనలు



**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమాసియా ప్రాంతంలో ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న సైనిక ఉద్రిక్తతలు అంతర్జాతీయ విమానయాన రంగంపై ప్రభావం చూపుతున్నాయి. డ్రోన్లు, క్షిపణుల దాడులతో పరిస్థితులు రోజురోజుకీ ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో, ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని భారత పౌర విమానయాన నియంత్రణ సంస్థ (డీజీసీఏ) కీలక అడ్వైజరీ జారీ చేసింది.

ఆ అడ్వైజరీ ప్రకారం, పశ్చిమాసియాలోని తొమ్మిది దేశాల గగనతలాన్ని భారత విమానయాన సంస్థలు పూర్తిగా నివారించాలని స్పష్టం చేసింది. నో-ఫ్లై జోన్‌గా ప్రకటించిన ఈ జాబితాలో ఇరాన్, ఇరాక్, ఇజ్రాయెల్, జోర్డాన్, కువైట్, లెబనాన్, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బహ్రెయిన్ ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఏ ఎత్తులోనైనా విమానాలు ప్రయాణించకూడదని - 2లో...

## సామాన్యుడికి డీజిల్ సెగ!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ముఖ్యంగా ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావం ఇప్పుడు భారత పారిశ్రామిక రంగంపై తీవ్రంగా పడుతున్నది. కేవలం రెండు వారాల వ్యవధిలోనే ఇండస్ట్రియల్ డీజిల్ ధరలు దాదాపు 46% పెరగడం గమనార్హం. ఇది నేరుగా వినియోగదారుల దైనందిన జీవితాన్ని, వస్తువుల ధరలను ప్రభావితం చేయనున్నది.

**ఏమిటీ ఇండస్ట్రియల్ డీజిల్ సెగ? :** మనం వాహనాల్లో వాడే డీజిల్ ధరలను ప్రభుత్వం కొంతవరకు నియంత్రిస్తున్నప్పటికీ, పరిశ్రమల్లో వాడే ఇండస్ట్రియల్ డీజిల్ ధరలు పూర్తిగా అంతర్జాతీయ మార్కెట్‌తో ముడిపడి ఉంటాయి. మార్చి 1న లీటరుకు 64.00 ఉన్న ధర, మార్చి 20 నాటికి 94.00 – 96.00 కు చేరింది. ఈ భారీ పెరుగుదల తయారీ వ్యయాన్ని అమాంతం పెంచేసింది. ఫలితంగా అనేక రంగాలపై దీని ప్రభావం తీవ్రంగా పడగా.. అంతిమంగా అది వినియోగదారులకు భారంగా మారనున్నది.

# గ్యాస్ సంక్షోభంపై చంద్ర'వ్యూహం'



(మొదటి పేజీ తరువాయి)

అప్పటి వరకు ఎటువంటి అంతరాయం లేకుండా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. భవిష్యత్తులో ఈ తరహా సంక్షోభాలు ఎదుర్కోవడానికి పైప్డ్ నేచురల్ గ్యాస్ వాడకం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పట్టణ ప్రాంతాల్లో సిలిండర్ల నుంచి పీఎన్‌జీకి మారేలా కొత్త పాలసీని సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారని తెలిపారు. సుమారు 2.60 లక్షల మందికి తక్షణమే ఈ కనెక్షన్లు ఇచ్చేలా నివేదిక సిద్ధమవుతోందన్నారు.

రాష్ట్రంలో 12 ఏళ్ల క్రితమే కిరోసిన్ సరఫరా నిలిపివేసినప్పటికీ, ప్రస్తుత గ్యాస్ కష్టాల దృష్ట్యా కేంద్రం 2800 కిలో లీటర్ల కిరోసిన్‌ను కేటాయించిందని వచ్చే సోమవారం నుంచి గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో లీటరు చొప్పున కిరోసిన్ పంపిణీ చేయాలని భావిస్తున్నామని తెలిపారు. గ్యాస్ సిలిండర్లను దారిమళ్లించే ఏజెన్సీలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని ఇప్పటికే నిబంధనలు ఉల్లంఘించిన 9 ఏజెన్సీలపై చర్యలు తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు వాడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రస్తుతం పరీక్షల సమయం కావడంతో విద్యా సంస్థలు, హాస్టళ్లు, ఆసుపత్రులు, అన్న క్యాంటీన్లకు గ్యాస్ సరఫరాలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ కలెక్టర్లకు ఎస్వోపీ జారీ చేశామని మంత్రి నాదెండ్ల అన్నారు.

# అకాల వర్షం.. అండగా ప్రభుత్వం



(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు ఎల్పీజీ సరఫరాపైనా సీఎం సమీక్షించారు. ఇరాన్ -- ఇజ్రాయిల్, అమెరికా మధ్య మరి కొన్నాళ్లు యుద్ధం కొనసాగితే... ఎల్పీజీ గ్లోబల్ సప్లయ్ చైన్ దెబ్బతినే అవకాశం ఉందని, ఆ సంక్షోభాన్ని ఎదుర్కొనేలా రాష్ట్రంలో సమర్ధవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉందని సీఎం అధికారులకు సూచించారు. ఎక్కడా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వకుండా చూడాలన్నారు. గ్రామీణ - గిరిజన ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆలయాలు, అన్న క్యాంటీన్లు, అంగన్వాడీలకు గ్యాస్ డెలివరీలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్జీ వంటి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎరువులు, పెట్రోల్, డీజిల్‌కు లోటు రానివ్వకుండా కేంద్రంతో సంప్రదింపులు జరపాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు.

# సామాన్యుడికి డీజిల్ సెగ!



(మొదటి పేజీ తరువాయి)

**ఇల్లు కట్టడం ఇక భారమే :** సిమెంట్, స్టీల్ తయారీలో ఇండస్ట్రియల్ డీజిల్ కీలక ఇంధనం. బాయిలర్లు, ఫర్నేస్ నడవడానికి ఈ చమురు అవసరం. ఇంధన ధర పెరగడంతో తయారీ సంస్థలు ఆ భారాన్ని డీలర్లపై, అక్కడి నుండి సామాన్యుడిపై వేస్తున్నాయి. ఫలితంగా సిమెంట్ బస్తా, టన్ను స్టీల్ ధరలు పెరిగి మధ్యతరగతి వాసుల సొంతింటి కల మరింత భారం కానున్నది.

**ఆహార శుద్ధి, నిత్యావసరాలు :** పాల డైరీలు, రైస్ మిల్లులు, ప్యాకేజ్డ్ ఫుడ్ కంపెనీలు తమ యంత్రాల నిర్వహణకు ఈ డీజిల్‌నే వాడుతుంటాయి. పాలను పాశ్చరైజ్ చేయడానికి అయ్యే ఖర్చు పెరగడం వల్ల లీటరు పాలపై ధర పెరిగే అవకాశం ఉంది. చిప్స్, బిస్కెట్లు వంటి ఉత్పత్తుల ధరలు పెరగడమో లేదా వాటి బరువు తగ్గడమో జరగవచ్చు.

**వస్త్ర పరిశ్రమ :** బట్టలకు రంగులు అద్దకం, ఫినిషింగ్ ప్రక్రియల్లో భారీగా ఇండస్ట్రియల్ డీజిల్ అవసరమవుతుంది. సూరత్, అహ్మదాబాద్ తోపాటు మన రాష్ట్రంలోని వస్త్ర పరిశ్రమతో సంబంధమున్న పోచంపల్లి, సిరిసిల్ల సహా అనేక ప్రాంతాల్లోని టెక్స్‌టైల్ యూనిట్లపై ఈ ప్రభావం పడనున్నది. ఇది అంతిమంగా దుస్తుల ధరల పెరుగుదలకు దారితీయనున్నది.

**విద్యుత్ కోతలు :** పవర్ గ్రిడ్ సమస్యలు ఉన్నప్పుడు పరిశ్రమలు భారీ డీజిల్ జనరేటర్లపై ఆధారపడతాయి. ఇప్పుడు డీజిల్ ధర పెరగడంతో, ఒక యూనిట్ విద్యుత్ ఉత్పత్తి ఖర్చు భారీగా పెరిగింది. ఇది చిన్న తరహా పరిశ్రమల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నది.

**వినియోగదారుడికి 'త్రిముఖ' దెబ్బ :** ఉత్పత్తి ఖర్చులు పెరగడం వల్ల వినియోగదారుడు కొనే ప్రతి వస్తువు (సబ్బు నుండి స్టీల్ వరకు) ధరలు పెరిగేందుకు అవకాశం ఉన్నది. దీంతోపాటు పారిశ్రామిక డీజిల్ ధర పెరగడం వల్ల రవాణా అనుబంధ ఉత్పత్తుల ధరలు పెరిగి, సరుకు రవాణా ఛార్జీలు కూడా అధికమవుతాయి. ఫలితంగా మార్కెట్లో నగదు లభ్యత తగ్గడం.. వస్తువుల ధరలు పెరగడం వల్ల సామాన్యుడి పొదుపు తగ్గిపోతుంది. ఇది ద్రవ్యోల్బణం పెరిగేందుకు కారణం అవుతుంది. అంతిమంగా ఇరాన్ సంక్షోభం త్వరగా సద్దుమణిగితే తప్ప చమురు ధరలు దిగి వచ్చే సూచనలు లేవు. ప్రభుత్వం పన్నుల విషయంలో (ముఖ్యంగా జీఎస్టీ పరిధిలోకి చమురును తీసుకురావడం) ఏదైనా వెసులుబాటు కల్పిస్తే తప్ప, పరిశ్రమలే కాదు అంతిమంగా వినియోగదారుడికి ఈ 'డీజిల్ సెగ' నుండి ఉపశమనం లభించదు.

# 'బాబుతోనే జాబు'ను నిజం చేస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మాటను నిలబెట్టుకుంటామని మంత్రి సవిత స్పష్టంచేశారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు విజయవంతం చేశామని, ఉగాది సందర్భంగా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కోసం దివ్యాంగుల శక్తి పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని తెలిపారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఇసుక, అన్న క్యాంటీన్లు, పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల నిర్మాణం ఇలా అభివృద్ధిని, సంక్షేమాన్ని సీఎం చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు.



**మాట నిలబెట్టుకున్న లోకేశ్:** ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకున్నారని మంత్రి సవిత తెలిపారు. 10,060 ఉద్యోగాల భర్తీకి ఉగాది సందర్భంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేశారన్నారు. ఇది రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు శుభవార్తని అన్నారు. అధికారంలోకి రాగానే 16 వేలకు పైగా టీచర్ పోస్టులు భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహించారన్నారు. జగన్ సహా వైసీపీ నాయకులు కోర్టుల్లో ఎన్ని కేసులు వేసినా, వాటిన్నింటినీ అధిగమించి మెగా డీఎస్సీ నిర్వహించారని మంత్రి నారా లోకేశ్ ను కొనియాడారు. అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మాటను నిలబెట్టుకుంటామని మంత్రి సవిత స్పష్టం చేశారు. బాబుతోనే జాబ్ గ్యారంటీని అనే నినాదాన్ని మాటలతో సరిపెట్టకుండా నిజం చేస్తున్నామన్నారు. ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ నిరుద్యోగ యువతను జగన్ మోసం చేశారని మండిపడ్డారు.

**ఘనంగా చౌడేశ్వరీ దేవి జాతర :** అంతకుముందు సోమందేపల్లిలో వెలసిన చౌడేశ్వరీ దేవిని మంత్రి సవిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి సోమందేపల్లి వాసులు ఘన స్వాగతం పలికారు. జాతర ఏర్పాట్లు, సౌకర్యాల గురించి భక్తులను అడిగి తెలుసుకున్నారు. వారంతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తనను కలిసి విలేకరులతో మాట్లాడుతూ, జాతర ఘనంగా భక్తిశ్రద్ధలతో జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులను అభినందిస్తూ, జాతర సజావుగా నిర్వహణకు ఆలయం వరకూ సీసీ రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. సోమందేపల్లి మండల కేంద్రంలో రూ. 2.50 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి కల్పన వంటి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాష్ట్రంపై చౌడేశ్వరీ దేవి కృప ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. మంత్రి సవిత వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు, చౌడేశ్వరీ దేవి ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా సరిపడా ఎల్‌పీజీ వంటగ్యాస్ నిల్వలు

(మొదటి పేజీ తరువాయి)

**గతవారం 11,300 టన్నుల కమర్షియల్ సిలిండర్ల సప్లై :** "పశ్చిమాసియా యుద్ధం మొదలు కావడానికి ముందు దేశంలో రోజూ సగటున 50 లక్షల నుంచి 55 లక్షల ఎల్‌పీజీ వంటగ్యాస్ సిలిండర్లు బుక్ అయ్యేవి. వంటగ్యాస్ కొరత ఏర్పడుతుందనే ఆందోళనతో ప్రజలు మార్చి 13న ఏకంగా 87.7 లక్షల సిలిండర్లను బుక్ చేసుకున్నారు. కానీ ఈవిధమైన ప్యానిక్ బుకింగ్ తగ్గిపోయి, గురువారం నాటికి 55 లక్షలకు చేరింది. గత రెండువారాల వ్యవధిలో దేశంలో ఎల్‌పీజీ వంటగ్యాస్ ఉత్పత్తిని 40 శాతానికిపైగా పెంచాం. పశ్చిమాసియా యుద్ధం మొదలైన తొలినాళ్లలో వాణిజ్య సిలిండర్ల సప్లైను కొన్నిరోజులు ఆపాం. కానీ ఆ తర్వాత వాణిజ్య సిలిండర్ల కస్టమర్ల గ్యాస్ అవసరాలను ఐదోవంతు మేర తీర్చడం మొదలుపెట్టాం. గతవారం రోజుల వ్యవధిలో వాణిజ్య సిలిండర్ల కస్టమర్లకు 11,300 టన్నుల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్లను సప్లై చేశాం. ఈనేపథ్యంలో దేశంలోని 15 ప్రాంతాల్లో 13,700 మంది కొత్తగా పీఎన్‌జీ పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్లు తీసుకున్నారు. మరో 7వేల మంది వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల కస్టమర్లు కూడా పీఎన్‌జీ గ్యాస్ కనెక్షన్లకు మారిపోయారు" అని సుజాత శర్మ వెల్లడించారు.

**ప్రీమియం కేటగిరీ పెట్రోలు ధరల పెంపు :** "ఎల్‌పీజీ సిలిండర్ల కొనుగోలుకు డోర్ డెలివరీ సిస్టమ్ లాంటి సరైన మార్గాలనే కస్టమర్లు అనుసరించాలి. ప్రీమియం కేటగిరీ పెట్రోలు ధరలు మాత్రమే పెరిగాయి. ఈమేరకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నిర్ణయాన్ని తీసుకున్నాయి. సాధారణ పెట్రోలు, డీజిల్ ధరలు మారలేదు" అని సుజాత శర్మ స్పష్టం చేశారు.

**ఒక్కరోజే దేశవ్యాప్తంగా 4,500 సోదాలు :** "ప్రస్తుత పరిస్థితుల్లో గ్యాస్‌ను వినియోగించే కస్టమర్ల వైఖరిలో చాలా మార్పు వచ్చింది. 7.5 లక్షల మంది ఎల్‌పీజీ యూజర్లు పీఎన్‌జీ పైప్డ్ గ్యాస్‌కు మారిపోయారు. ఇంధన సప్లైలను పర్యవేక్షించేందుకు దేశవ్యాప్తంగా పర్యవేక్షణా యంత్రాంగాలను బలోపేతం చేశాం. 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కంట్రోల్ రూంలు, జిల్లా మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఇంధన సరఫరాలో అవకతవకలను అడ్డుకునేందుకు కఠినమైన చర్యలను తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా గురువారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 4,500 సోదాలు నిర్వహించారు. ఒక్క ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే 1100 రైడ్స్ చేశారు. దేశంలోని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ) 1800 ఆకస్మిక తనిఖీలను నిర్వహించాయి" అని పెట్రోలియం, సహజ వాయువు శాఖ జాయింట్ సెక్రెటరీ సుజాత శర్మ తెలిపారు.




**చమురు, ఎల్‌పీజీ సప్లైలకు ఆ మినహాయింపు :** ఎల్‌పీజీ వంటగ్యాస్, ముడి చమురు సప్లైలకు ఊరటనిచ్చే చర్యలను చేపడుతున్నట్లు కేంద్ర నౌకాయాన శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా తెలిపారు. ఇందులో భాగంగా ముడి చమురు, ఎల్‌పీజీ సప్లైలకు మార్చి 14 నుంచి 31 వరకు గ్రౌండ్ ఛార్జీలు, రీఫర్ ఛార్జీల నుంచి మినహాయింపును కల్పిస్తూ న్యూ మంగళూర్ పోర్టు నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు.

**గల్ఫ్‌లో ఆరుగురు భారతీయుల మృతి : విదేశాంగ శాఖ :** పశ్చిమాసియా యుద్ధం వల్ల గల్ఫ్ దేశాల్లో ఇప్పటివరకు ఆరుగురు భారతీయులు చనిపోగా, ఒకరి ఆచూకీ గల్లంతైందని విదేశాంగ శాఖ అదనపు కార్యదర్శి (గల్ఫ్) అసీమ్ ఆర్ మహాజన్ శుక్రవారం వెల్లడించారు. చనిపోయిన భారతీయుల భౌతిక కాయాలను వీలైనంత త్వరగా దేశానికి తీసుకొచ్చేందుకు, ఆయా దేశాల అధికార వర్గాలతో అక్కడి భారత ఎంబసీలు సమన్వయం చేసుకుంటున్నాయని ఆయన తెలిపారు. ఆచూకీ గల్లంతైన భారతీయుడిని గుర్తించే దిశగానూ ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సౌదీ అరేబియా, ఒమన్, ఇరాక్, యూఏఈలలోని భారత ఎంబసీలు ఈ అంశాలపై పూర్తి ఫోకస్ పెట్టాయని అసీమ్ ఆర్ మహాజన్ చెప్పారు.

**3 లక్షల మంది భారతీయులు తిరిగొచ్చేశారు :** గల్ఫ్ దేశాల నుంచి విమాన సర్వీసులు క్రమంగా పెరుగుతున్నాయని, పెద్దసంఖ్యలో భారతీయులు అక్కడి నుంచి స్వదేశానికి వస్తున్నారన్నారు. ఫిబ్రవరి 28న పశ్చిమాసియా సైనిక ఘర్షణ మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు 3 లక్షల మంది భారతీయులు గల్ఫ్ దేశాల నుంచి వచ్చేశారని ఆయన పేర్కొన్నారు. కానీ ఇప్పటికీ యూఏఈ నుంచి భద్రతా పరిస్థితుల ప్రాతిపదికన పరిమిత స్థాయిలోనే నాన్ షెడ్యూల్డ్ విమాన సర్వీసులను నడుపుతున్నారని అసీమ్ ఆర్ మహాజన్ తెలిపారు. శుక్రవారం రోజు దాదాపు 90 విమానాలు యూఏఈలోని వివిధ ఎయిర్‌పోర్టుల నుంచి భారత్‌కు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇక ఒమన్, సౌదీ అరేబియాల నుంచి భారత్‌కు విమాన సర్వీసులు కొనసాగుతున్నాయని, ఖతర్ గగనతలం పాక్షికంగా తెరుచుకుందని పేర్కొన్నారు. శుక్రవారం రోజు భారత్‌కు 10 నాన్ షెడ్యూల్డ్ విమాన సర్వీసులను ఖతర్ ఎయిర్‌వేస్ నడిపే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు.

**తెరుచుకోని కువైట్, బహ్రెయిన్ గగనతలాలు :** ఇప్పటికీ కువైట్, బహ్రెయిన్ గగనతలాలు మూసివేసి ఉన్నాయన్నారు. కువైట్ ఎయిర్ వేస్ సౌదీ అరేబియాలోని అల్ ఖైసుమా హఫర్ అల్ బాతిన్ ఎయిర్‌పోర్టు నుంచి భారత్‌లోని కొచ్చికి శుక్రవారం తొలి విమాన సర్వీసును నడిపే అవకాశం ఉందని అసీమ్ ఆర్ మహాజన్ తెలిపారు. బహ్రెయిన్‌కు చెందిన గల్ఫ్ ఎయిర్ సైతం సౌదీ అరేబియాలోని దమ్మామ్‌లో ఉన్న కింగ్ ఫహద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నుంచి భారత్‌కు విమాన సర్వీసులను కొనసాగిస్తుందన్నారు.

# పశ్చిమాసియా గగనతలంపై డీజీసీఏ కఠిన నిబంధనలు

(మొదటి పేజీ తరువాయి)

డీజీసీఏ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

**పరిస్థితి మరింత ఉద్రిక్తంగా! :** ప్రస్తుతం జరుగుతున్న సైనిక దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో ఈ ప్రాంత గగనతలం పౌర విమానాలకు అత్యంత ప్రమాదకరంగా మారిందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌లోని లక్ష్యాలపై దాడులు జరిపిన తర్వాత పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. దీనికి ప్రతీకారంగా ఇరాన్ కూడా దాడులకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించడంతో, యుద్ధ ముప్పు పెరిగింది.



**మాన సర్వీసులను నిలిపివేయడం సాధ్యం కాదు :** ఈ పరిస్థితుల్లో, భారత విమానయాన సంస్థలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని డీజీసీఏ సూచించింది. నో-ఫ్లై జోన్‌గా పేర్కొన్న దేశాల గగనతలాన్ని పూర్తిగా దూరంగా ఉంచాలని ఆదేశించింది. అయితే, భారత్ నుంచి యూరప్, ఇతర పశ్చిమ దేశాలకు వెళ్లే విమానాలకు ఈ మార్గం కీలకం కావడంతో, పూర్తిగా విమాన సర్వీసులను నిలిపివేయడం సాధ్యం కాదని గుర్తించింది.

**32,000 అడుగుల ఎత్తులో మాత్రమే :** ఈ నేపథ్యంలో, సౌదీ అరేబియా, ఒమన్ గగనతలాల వినియోగానికి కొన్ని షరతులతో మినహాయింపులు ఇచ్చింది. ఈ రెండు దేశాల గగనతలంలో ప్రయాణించే విమానాలు కనీసం 32,000 అడుగుల ఎత్తులో మాత్రమే ప్రయాణించాలని ఆదేశించింది. దీనికంటే తక్కువ ఎత్తులో ప్రయాణిస్తే భూమి నుంచి ప్రయోగించే క్షిపణుల పరిధిలోకి వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

**వెంటనే పైలట్లకు చేరేలా చూడాలని! :** ప్రస్తుత పరిస్థితుల్లో ఎయిర్‌లైన్స్ తమ భద్రతా అంచనాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని డీజీసీఏ అభిప్రాయపడింది. ప్రమాద పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, తగిన ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసుకోవాలని సూచించింది. యుద్ధ ప్రభావిత ప్రాంతాలకు వెళ్లే విమానాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపింది. ఇక ఇప్పటికే గాల్లో ఉన్న విమానాలకు సంబంధించిన సమాచారం కూడా వెంటనే పైలట్లకు చేరేలా చూడాలని డీజీసీఏ సూచించింది. ఇందుకోసం NOTAM ద్వారా గగనతల పరిమితులు, తాజా మార్పులు, ప్రమాద సూచనలను నిరంతరం అప్‌డేట్ చేయాలని పేర్కొంది.

**కొత్త మార్గదర్శకాలు జారీ చేసే అవకాశం :** అంతేకాకుండా, ఎయిర్‌లైన్స్ తమ ఫ్లైట్ క్రూ కు తాజా సమాచారం అందించే బాధ్యతను తీసుకోవాలని స్పష్టం చేసింది. పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతున్న నేపథ్యంలో, ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేలా కాంటింజెన్సీ ప్లాన్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించింది. డీజీసీఏ జారీ చేసిన ఈ అడ్వైజరీ వెంటనే అమల్లోకి వచ్చిందని తెలిపింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ఈ మార్గదర్శకాలు మార్చి 28 వరకు అమల్లో ఉంటాయని పేర్కొంది. పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటే, తదుపరి సమీక్షించి కొత్త మార్గదర్శకాలు జారీ చేసే అవకాశం ఉందని తెలిపింది. మొత్తంగా, పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం ప్రపంచ విమానయాన రంగాన్ని అప్రమత్తం చేసింది. ప్రయాణికుల భద్రతే ప్రధానం అన్న దృష్టితో భారత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో విమానయాన సంస్థలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# భక్తుల విశ్వాసం..నమ్మకానికి భరోసా



(మొదటి పేజీ తరువాయి)

త్వరలో రూ. 3 కోట్లతో ఫ్రాన్స్ నుంచి ఈ-నోస్, ఈ-టంగ్ యంత్రాలు రాబోతున్నాయని తెలిపారు. ఇవి వాసన, రుచి లో తేడాలను గుర్తిస్తాయన్నారు. చిన్న పెద్దా కలిపి 50 పరికరాలు/యంత్రాలు ఉన్నాయి. ఆహార పదార్థాల్లో సేకరించిన ఒక్కో నమూనాను పదుల సంఖ్యలో పరీక్షించే సామర్థ్యం ల్యాబ్ కు ఉంది. ముడి సరుకులు, ఇతర నమూనాల విషయాల్లోనూ ఇలాగే పరీక్షలు జరుగుతాయి. గరిష్టంగా ఒక నమూనా ద్వారా 50 రకాల పరీక్షలు చేయడానికి వీలుశీది.

**ప్రసాదాలు, జల, ముడి సరకుల నమూనాల పరీక్షలు! :** కొత్తగా ఏర్పాటైన ల్యాబ్లో ప్రసాదాలు, వాటికి వినియోగించే ముడిసరకుల్లో పురుగు మందుల అవశేషాలు, భారలోహాలు, క్రిమికీటకాలు, వంటి వాటి గురించి నమూనాలు పరీక్షించడం ద్వారా తెలుసుకుంటారు. ప్రసాదాల తయారీకి ఉపయోగించే నెయ్యి, జీడిపప్పు, క్రిస్మిస్, బాదంపప్పు, శనగలు, చక్కెర, యాలకులు, పసుపు కారం వంటి నమూనాలను ఈ ల్యాబ్లో పరీక్షిస్తారు. జలప్రసాదాల నమూనాలను సైతం ఇక్కడ పరీక్షిస్తారు. నెయ్యి, నూనెలో ఉండాల్సిన కొవ్వుల శాతం, వెజిటబుల్ ఆయిల్, జంతువుల కొవ్వు వంటివాటిని సులువుగా గుర్తిస్తారు లడ్డూల్లో ఎనర్జీ లెవల్స్, వాడిన నెయ్యిని, ఆహారంలో బ్యాక్టీరియా ఉందా? లేదా? కూడా ఈ ల్యాబ్లో పరీక్షిస్తారు.

**ఇప్పటివరకు...:** తిరుమలలో 1981లో వాటర్ క్వాలిటీ టెస్టింగ్ ల్యాబరేటరీ ఏర్పడింది. 1988లో దీనిని ఉన్నతీకరించి, ఆహార పదార్థాల నమూనాలు పరీక్షించడం ప్రారంభించారు. 2018లో దీనికి ఎనబీఎల్ అక్రిడిటేషన్ లభించింది. ఈ ల్యాబ్లో సాధారణ స్థాయిలో పరీక్షలు జరుగుతున్నాయి.

# భద్రాచలంలో విషాదం

(మొదటి పేజీ తరువాయి)

గల్లంతైన వారిలో కొందరు రామాలయంలో పనిచేసే ఉద్యోగుల పిల్లలు ఉన్నట్లు సమాచారం. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

భద్రాచలం అనుకోని వున్న కూనవరం రోడ్లో ఆంధ్రప్రదేశ్ పరిధిలోని కొల్లుగూడెం సమీపంలో భద్రాచలం పట్టణానికి చెందిన ఓ ఏడుగురు నది స్నానం కోసం వెళ్ళారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో గోదావరి లోతుపై అవగాహన లేక ఐదుగురు గల్లంతైన సంఘటన చోటుచేసుకుంది. మిగిలిన ఇద్దరు స్నేహితులు మునిగిపోతున్న వారిని గుర్తించి భద్రాచలం పోలీసులకు సమాచారం తెలిపారు.

సంఘటన ప్రాంతం ఆంధ్ర పరిధిలో ఉండటంతో భద్రాచలం పోలీసులు ఎటపాక పోలీసు స్టేషన్కు తెలిపారు. భద్రాచలం, ఎటపాక పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటన పై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

**ముగ్గురి మృతదేహాలు స్వాధీనం...:** భద్రాచలం-వేలేరు వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగి అమరావతి ఎస్ఆర్ఎం కాలేజీకి చెందిన ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతైన విషయం తెలిసిందే. గల్లంతైన వారిలో ముగ్గురి మృతదేహాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. సతీశ్ (మదనపల్లి), నవదీప్ (ఉయ్యూరు), తేజజ్ఞ (ఉయ్యూరు), శ్రీకర్ (భద్రాచలం), అభిరామ్ (విజయనగరం) అనే విద్యార్థులు గల్లంతైన విషయం తెలిసిందే. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఉగాది కానుకగా యువతకు జాబ్ క్యాలెండర్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర యువతకు ఉగాది పండుగ సందర్భంగా కూటమి ప్రభుత్వం గొప్ప కానుకగా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయడం హర్షణీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మంత్రి నారా లోకేష్ విడుదల చేసిన 10,060 పోస్టులతో కూడిన జాబ్ క్యాలెండర్ నిరుద్యోగ యువతకు కొత్త ఆశలను నింపిందన్నారు. ఇది నిరుద్యోగులకు నిజమైన ఉగాది పండుగగా మారిందని పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని మంత్రి లోకేష్ కచ్చితంగా అమలు చేస్తుండటం అభినందనీయమని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఒకవైపు పరిశ్రమలను రాష్ట్రానికి ఆకర్షిస్తూ, మరోవైపు యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండు సంవత్సరాల్లో సుమారు 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జాబ్ క్యాలెండర్ పేరుతో యువతను మోసం చేశారని, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. కమిషన్ల కోసం పరిశ్రమలను రాష్ట్రం నుంచి వెళ్లగొట్టడం వల్ల యువత భవిష్యత్తు దెబ్బతిన్నదన్నారు. ప్రస్తుతం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌లో విద్య, పోలీస్ తదితర కీలక శాఖలకు ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందని, మెగా డీఎస్సీ ద్వారా వేలాది ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. గ్రూప్-1, గ్రూప్-2, హోం, విద్యా శాఖల్లో షెడ్యూల్ ప్రకారం నోటిఫికేషన్లు విడుదల చేసి, నిర్దేశిత సమయంలోనే నియామకాలు పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇప్పటినుంచే ప్రిపరేషన్ ప్రారంభించాలని, తమ లక్ష్య సాధనకు కృషి చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. యువత ఆకాంక్షలను నెరవేర్చడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## సహనం, ప్రేమ, సంతోషంల కలయికే రంజాన్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సహనం, ప్రేమ, దయ, సోదరభావం, పరోపకారం, సంతోషం ల కలయికే రంజాన్ అని ఈ సుగుణాలన్నీ ప్రజలకు భగవంతుడు ప్రసాదించాలని కోరుతూ ప్రజలకు మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. నెలరోజుల ఉపవాస దీక్షల అనంతరం, నెలవంక అగుపించడంతో శనివారం దేశవ్యాప్తంగా రంజాన్ నిర్వహించుకుంటున్న సందర్భంగా ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు తెలియజేస్తూ మంత్రి ఫరూక్ అమరావతిలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.లి

లిముస్లింల పవిత్ర గ్రంథం అయిన 'ఖురాన్' ఆవిర్భవించిన నెల రంజాన్ అని,ఈ నెలలో ఉపవాసాలకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు.లి

లినెలవంక కనిపించడంతో ప్రారంభమయ్యే రంజాన్ మాసం మళ్లీ నెలవంక వచ్చిన తర్వాతే ముగుస్తుందన్నారు. అల్లా ప్రజలందరి జీవితంలో ఆనందం నింపాలని, ఆరోగ్యం, ఐశ్వర్యం ప్రసాదించాలనిమంత్రి ఫరూక్ తెలియజేశారు.

## వేసవి జాగ్రత్తలు పాటించండి:ప్రముఖ మూత్ర పిండ వైద్య నిపుణులు డాక్టర్ గౌతమి

**శ్రీకాకుళం మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
వేసవి నుండి ఉపశమనం పొందేందుకు వాకర్స్ అంతా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి అని శ్రీకాకుళం నగరానికి చెందిన ప్రముఖ మూత్ర పిండాల వ్యాధి నిపుణులు డాక్టర్ బెందాలం గౌతమి అన్నారు. గురువారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి- జాగ్రత్తలు అవగాహన సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..దాహం వేయకపోయినా రోజుకి మూడు నుండి నాలుగు లీటర్ల నీరు.. మజ్జిక.. కొబ్బరి నీరు వంటివి త్రాగాలని సూచించారు.. పుచ్చకాయ.. దోశకాయ.. వంటి నీటిశాతం ఎక్కువగా ఉన్న పండ్లు తినాలని చెప్పారు. వేసవిలో కిడ్నీ పాడుకాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. వడదెబ్బ.. డీ.. హైడ్రేషన్ కాకుండా కాపాడుకొనే బాధ్యత అందరిపై ఉందని అన్నారు.. శారీరిక శ్రమ తగ్గించుకోవటం మంచిదని



సూచించారు.. మహిళలు కొబ్బరి నీరు ఎక్కువ త్రాగాలని.. ఈ ఏడాది వేసవి తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి అని డాక్టర్ గౌతమి సూచించారు.. అంతకన్నా ముందు సీనియర్ వాకర్ ఇందిరా ప్రియదర్శిని అవార్డు గ్రహీత నళ్ళబాటి కృష్ణమూర్తి 76 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్.. శాసపు జోగినాయుడు.. గోలీ ఉమా మహేశ్వరరావు.. గేదెల లక్ష్మీ.. సంతోష్.. మోహన్.. మల్లిబాబు.. వాసంతి.. కామేశ్వర రావు.. గీత.. గద్దిబోయిన కృష్ణ.. తిరుపతి.. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల్లో ముత్యపు పందిరి సేవ :భక్తులకు దివ్యానుభూతి

**తిరుపతి, మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు గురువారం రాత్రి 7 గంటలకు ముత్యపుపందిరి వాహనంపై శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామివారు భక్తులను కటాక్షించారు. గజరాజులు, వృషభాలు, అశ్వాలు ముందుకు సాగుతుండగా, భజన బృందాలు కోలాటాలు ఆడుతూ, స్వామివారు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించారు. మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగించే ముత్యపుపందిరి వాహనంపై స్వామివారి దర్శనం భక్తులకు విశేష ఆనందాన్ని కలిగించింది. జ్యోతిషశాస్త్రం ప్రకారం ముత్యం చంద్రునికి ప్రతీకగా భావించబడుతుంది. ముత్యాల పందిరి కింద స్వామివారి దర్శనం తాపత్రయాలను తొలగించి, భక్తుల జీవితాలకు శాంతి, చల్లదనాన్ని ప్రసాదిస్తుందని విశ్వసిస్తారు. ఈ వాహనసేవలో ఆలయ డెప్యూటీ ఈవో శ నాగరత్న, టెంపుల్ ఇన్స్పెక్టర్ సురేష్, ఆలయ అర్చకులు మరియు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నరసరావుపేటలో ఘనంగా 'శ్రీ పరాభవ' నామ సంవత్సర ఉగాది వేడుకలు

**నరసరావుపేట, మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పార్టీ కార్యాలయంలో భక్తిశ్రద్ధలతో పంచాంగ శ్రవణం నరసరావుపేట పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 'శ్రీ పరాభవ' నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ శాసనసభ సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**అభివృద్ధి పథంలో నియోజకవర్గం:**
ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద్ బాబు గారు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ పరాభవ నామ సంవత్సరంలో నరసరావుపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు అంకితభావంతో పనిచేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా రైతులకు సాగునీరు, యువతకు ఉపాధి కల్పన తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు. తెలుగు వారి ఆత్మగౌరవానికి, సంస్కృతికి ప్రతీక అయిన ఉగాది పండుగను, మన ఆచారాలను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

**పంచాంగ శ్రవణం సందేశం:**
వేడుకల్లో భాగంగా ప్రముఖ సిద్ధాంతి గారి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. కొత్త సంవత్సరంలో గ్రహ గతులు, వర్షపాతం, రాజపూజ్యం మరియు అవమానాల గురించి సిద్ధాంతి వివరించారు. అనంతరం షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని అందరికీ పంపిణీ చేశారు. జీవితంలోని కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలనే సందేశాన్ని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉగాది పచ్చడిలోని తీపి, వొగరు, చేదుల కలయిక వలె జీవితంలోని ఒడిదుడుకులను తట్టుకుని, పార్టీ బలోపేతానికి, ప్రజా సేవకు కార్యకర్తలు నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

**పాల్గొన్న ప్రముఖులు:**
ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు, వివిధ విభాగాల ప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం అంతా పండుగ వాతావరణంతో, తోరణాలతో కళకళలాడింది.

## ఆయుర్వేద మొక్కలతో ప్రత్యేక వనాల పెంపకం : వినూత్న కార్యక్రమానికి సిఈఓ ఆవుల శ్రీకారం ఏపీఎంపీపీ బోర్డు చొరవతో ప్రయోగాత్మక యత్నం,



**కాకినాడ, మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఆంధ్రప్రదేశ్ ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు (ఏపీఎంపీబి) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఈఓ) ఆవుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శ్రీ పరాభవ నామ ఉగాది సందర్భంగా కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం గోవిందపురం గ్రామం ప్రయోగాత్మక యత్నానికి వేదికైంది. ధన్వంతరి సహస్రాయు పీఠం, రామ కపీశ్వర ఆదివాసీ సొసైటీ ఆధ్వర్యంలో, ఏపీఎంపిపి బోర్డు సహకారంతో సరికొత్త అంకురం మొదలైంది. మూడు ఎకరాల్లో శ్రీ పూజలమ్మ ఆయుర్వనం, 0.52 ఎకరాల్లో గణపతి వనం, 2.48 ఎకరాల్లో ఆయుర్వేద మొక్కలతో అడవిని పెంచడానికి సర్వం సిద్ధమైంది. ధన్వంతరి సహస్రాయుధం వ్యవస్థాపన చైర్మన్ రవి వర్మ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎంపిపి బోర్డు సీఈవో ఆవుల చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. అతిథులుగా బోర్డు ఉప సీఈవో ప్రదీప్, ప్రముఖ పారిశ్రామికవేత్త రాజమండ్రి నాగేశ్వరరావు, ఆరోగ్య శాఖ చలమయ్య, ఉద్యాన శాఖ ఏడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోడు వ్యవసాయం చేసే గిరిజన రైతులకు ప్రత్యేకంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకట వల్లి సుబ్బరాజు, రఘురామరాజు, ప్రెసిడెంట్ కె. వెంకటేశ్వర రావు, ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు వి. సత్య రామచంద్రరావు, స్థానిక రైతులు కోరుకొండ వెంకన్న, కోరుకొండ కళ్యాణ్, కొల్లు రామకృష్ణ, కమ్మిల సత్తిబాబు, కమ్మిల వీరయ్య, కాపు, మార్నిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 26 ఏళ్ల సేవా ప్రయాణానికి గౌరవ వందనం "సేవా రత్న" ఉగాది పురస్కారం ఓలేసి ప్రసాద్‌రావుకు....

**విశాఖపట్నం, మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
సమాజ సేవను ధ్యేయంగా తీసుకుని రెండు దశాబ్దాలకు పైగా ప్రజల మధ్య నిలిచిన సీనియర్ జర్నలిస్టు శ్రీ ఓలేసి ప్రసాద్‌రావు గారికి "సేవా రత్న" ఉగాది పురస్కారం లభించడం విశేషంగా నిలిచింది. సూర్య దినపత్రిక ఉత్తరాంధ్ర ప్రతినిధిగా పనిచేస్తూ, 26 ఏళ్లుగా నిరంతరం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న ఆయన సేవలకు ఈ గౌరవం దక్కడం పత్రికారంగానికి గర్వకారణంగా మారింది.

సేవా పథంలో అంకితభావంతో సాగుతున్న ఓలేసి ప్రసాద్‌రావు గారు, అనేక సామాజిక ప్రముఖుల ప్రశంసలను అందుకుంటూ ఘన సన్మానం పొందారు. ఆయన కలం ఎప్పుడూ ప్రజల కోసం కదులుతూనే ఉంటుంది. సమాజంలోని బడుగు, బలహీన వర్గాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన పాత్ర విశేషంగా గుర్తించబడింది.

నిజాయితీ, నిబద్ధత, ప్రజా పక్షపాతం ఈ మూడు విలువలను తన జర్నలిజం మూలసూత్రాలుగా తీసుకున్న ఆయన, ఒకవైపు ఉత్తమ జర్నలిస్టుగా, మరోవైపు సేవాభావంతో కూడిన వ్యక్తిగా సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. ప్రజా సమస్యలపై ఆయనకు ఉన్న లోతైన అవగాహన, స్పందన ఆయనను ప్రత్యేకంగా నిలబెడుతోంది.

విశ్వశాంతి యోగ సత్సంగం (గాజువాక) ఆధ్వర్యంలో, యోగాచార్య డాక్టర్ కొల్లి ఈశ్వరరావు (నేషనల్ యోగ రిఫరీ) సాన్నిధ్యంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో, ఓలేసి ప్రసాద్‌రావు గారి



సేవలను కొనియాడుతూ పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

"సేవా రత్న" అవార్డు ఆయనకు కేవలం ఒక గౌరవమే కాదు ఇది ఆయన నిరంతర సేవా స్ఫూర్తికి, ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు ప్రతీక. ఆయన ప్రస్థానం యువతకు దిక్సూచి, సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తూ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అందరూ ఆకాంక్షించారు.

## అనంతసాగరం మండలంలోని రైతుల పంట నష్టంపై స్పందించిన మెట్టుకూరు కృష్ణారెడ్డి

**ఆత్మకూరు, మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
అనంతసాగరం మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షాలు, వడగళ్ల వానలతో పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు అండగా నిలుస్తోందని మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు మెట్టుకూరు కృష్ణారెడ్డి తెలిపారు.

చిలకలమర్రి, మంగుపల్లి, కామిరెడ్డిపాడు, పాతాళపల్లి, సోమశిల, ఉప్పలపాడు, వరికుంటపాడు, పీకే-పాడు, అనంతసాగరం, గౌరవరం గ్రామాల్లో జరిగిన పంట నష్టంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అధికారులను క్షేత్రస్థాయిలోకి పంపించి పంటల నష్టాన్ని వేగంగా అంచనా వేయిస్తున్నట్లు చెప్పారు. ప్రాథమిక వివరాల ప్రకారం సుమారు 915 హెక్టార్లలో వరి పంట నష్టపోయి, 995 మంది రైతులు ప్రభావితమయ్యారని తెలిపారు. అలాగే ప్రత్తి పంటకు చెందిన 140 ఎకరాలు దెబ్బతిని, 136 మంది రైతులు నష్టపోయినట్లు వెల్లడించారు. ఈ పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత గంభీరంగా పరిగణిస్తోందని, అర్హులైన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. దేవాదాయ మరియు ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్లు తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అండగా నిలిచి త్వరితగతిన పరిహారం అందించేలా కృషి చేస్తోందని అనంతసాగరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మెట్టుకూరు కృష్ణారెడ్డి భరోసా ఇచ్చారు.



## శ్రీ శ్రీ తాళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

**గూడూరు, మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
గూడూరు పట్టణం శివారులో వెలసియున్న గ్రామదేవత శ్రీ శ్రీ తాళమ్మ ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు ,అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉగాది పండుగను పురస్కరించుకొని ఆలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమం పూజా కార్యక్రమాలకు ప్రతి సంవత్సరం ఉభయ దాతలగా ఉప్పాల వాసుగౌడ్ దంపతులు, నాసిన సుధాకర్ గౌడ్ దంపతులు, పర్చూరు బాలకృష్ణ గౌడ్ దంపతులు వ్యవహరిస్తారు. ఉగాది పండుగ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమంలో పల్లకి సేవ, అనంతరం పంచాంగ శ్రవణాన్ని వినిపించారు.



## బలిజ భవన నిర్మాణానికి విరాళాల సేకరణ:

### ముందంజలో బసవయ్యపాలెం బలిజ కులస్తులు



**బసవయ్యపాలెం, మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
బసవయ్యపాలెం గ్రామంలోని బలిజ కులస్తులు సమాజ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తూ బలిజ భవన నిర్మాణానికి విరాళాల సేకరణలో ముందంజలో నిలిచారు. సమాజ అభివృద్ధి, సామూహిక కార్యక్రమాలు మరియు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా భవనం నిర్మించాలని సంకల్పించి, గ్రామంలోని యువత, పెద్దలు కలిసి చురుకుగా విరాళాలు సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందిస్తున్నారు. భవనం నిర్మాణం పూర్తయిన తరువాత వివిధ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు కేంద్రంగా ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి సమిష్టి కృషి ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, మాజీ ధర్మకర్తలి మండల సభ్యులు అంజూరు శ్రీనివాసులు, ముత్యాల పార్థసారథి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కదూరు కమల కుమార్, వేము కోదండ రామయ్య, వల్లం గోపి,వేము మునీంద్ర,కదూరు హరిగోపాల్, కదూరు నాగరాజు, కదూరు ఉదయ్ కుమార్,చొక్కాని నాదముని,చొక్కాని పోలయ్య, చొక్కాని రామూర్తి, కదూరు శామంత్ కుమార్,సూర బిందు కుమార్,సూర దేవేంద్ర కుమార్,నాగలాపురం గోవర్ధన్,చక్రాల మురళి,రవి రాయల్, చందు రాయల్, కదూరు రూపేష్ కుమార్, వేము గోవర్ధన్, వేము పట్టాభి,పేట జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇరికించారా... ఇరుక్కున్నారా..

**ఏలూరు మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
హైదరాబాద్ మెయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్ కేసులో సంచలన వాస్తవాలు బయటికొస్తున్నాయి.. ఒక సాధారణ డిన్నర్ పార్టీ అని వెళ్ళిన ఏలూరు ఎంపీ తెలియకుండానే డ్రగ్ కేసులో ఇరుక్కుపోయారు. దీని వెనుక తీవ్రమైన కుట్ర కోణం ఉందనే వాదన తెరపైకి వచ్చింది. కనీసం సిగరెట్ కూడా తాగే అలవాటు కూడా లేని పుట్టా మహేష్ కుమార్ పై డ్రగ్స్ ఆరోపణలు రావడంతో అయన సన్నిహితులు, పార్టీ నేతలు విస్తుపోయారు. . ఒక వివాహ కార్యక్రమానికి వెళ్లాల్సి ఉన్న ఎంపీ మార్గమధ్యంలో ఫార్మ్ హౌస్ లో ఉన్న ఒక స్నేహితుడిని కలిసేందుకు ఆగారు. ఎంపీ ఫామ్ హౌస్ కి వెళ్ళిన కొద్దిసేపటికి ఈగల్ టీమ్ పోలీసులు వచ్చి డ్రగ్స్ చెకింగ్ చేయాలని చెప్పి అక్కడ ఉన్న 11 మంది వద్ద పోలీసుల సమక్షంలోనే యూరిన్ శాంపిల్ తీసుకుని రాపిడ్ టెస్ట్ చేసారు. 10 నిమిషాల తర్వాత చేవెళ్ల డీసీపీ వచ్చి ఐదుగురికి పాజిటివ్ వచ్చిందని, పుట్టా మహేష్ కుమార్ సహా మిగిలినవారికి నెగటివ్ వచ్చిందని స్పష్టంగా ప్రకటించిన విషయం అన్ని మీడియాలలో రావడం ప్రజలంతా దానిని చూడటం అందరికి తెలిసిన విషయమే. చేవెళ్ల డీసీపీ ఏలూరు ఎంపీ వద్దకు వచ్చి మీకు నెగటివ్ వచ్చింది, మీరు కొద్దిసేపటిలో మిమ్మలిని పంపించేస్తామని కూడా చెప్పినట్లు సమాచారం. అసలైన ట్విస్ట్ ఇక్కడే మొదలయింది. ఇంతలో ఎస్పీ గిరిధర్ రంగప్రవేశం చేసారు. పుట్టా మహేష్ కు యూరిన్ టెస్ట్ లో నెగటివ్ వచ్చిన రిపోర్ట్ ను పోలీసులు ఎస్పీ ముందుంచారు. రిపోర్ట్ ను చూసిన ఎస్పీ అక్కడనుంచే ఎవరితోనో ఫోన్ లో మాట్లాడారు. మాట్లాడుతూ తలసాని శ్రీనివాస్ గారి అల్లుడు ఉన్నాడని ఫోన్ లోనే అవతలి వ్యక్తులకు చెప్పారని తెలుస్తోంది . ఈ మాటలు అక్కడ అందరు వింటూనే ఉన్నట్లు కూడా సమాచారం . ఆ మాటలు వింటూనే ఉన్న ఎంపీ పుట్టా మహేష్.. నేను తలసాని అల్లుడిని కాదని తెలపటానికి ప్రయత్నించినట్టు తెలిసింది. కానీ ఎస్పీ ఆ మాటలు ఏవి పట్టించుకోకుండా ఫోన్ పెట్టేసిన తర్వాత మరొక ఫోన్ కూడా మాట్లాడారు. అనంతరం పోలీసులవేపు తిరిగి, యూరిన్ టెస్ట్ కచ్చితమైన రిజల్ట్ రాదు, బ్లడ్ టెస్ట్ కూడా చేస్తేనే కచ్చితమైన రిజల్ట్ వస్తుందని చెప్పి, నెగటివ్ వచ్చిన వాళ్ళతో సహ వీరందరిని ఇక్కడే ఉంచండి, బ్లడ్ శాంపిల్స్ కోసం పంపించాలని చెప్పి పక్కకు వెళ్లిపోయారు. ఎస్పీ ఆదేశాల మేరకు తెల్లవారుజామున 3 గంటల సమయంలో 11 మందిని ఎర్రగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఇక్కడే అసలైన మాయ జరిగింది. తీసుకెళ్లింది బ్లడ్ సాంపిల్స్ కోసం.. కానీ అక్కడ తీసుకుంది మళ్ళి యూరిన్ శాంపిల్స్ మాత్రమే. ఇక్కడ కూడా 10 మంది యూరిన్ సాంపిల్స్ ఒక వైపుగా తీసుకెళ్లారు. కానీ ఎంపీ పుట్టా మహేష్ యూరిన్ శాంపిల్ మరోవైపు పంపినట్లు సమాచారం. అనంతరం ఈ 11 మందిని శంషాబాద్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. రెండవ సారి యూరిన్ సాంపిల్స్ తీసుకున్న సుమారు 5 గంటల తర్వాత, అంటే సుమారు ఉదయం 9 గంటల సమయంలోఈగల్ ఎస్పీ మీడియా ముందుకు వచ్చి, బ్లడ్ శాంపిల్స్ లో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు పాజిటివ్ వచ్చిందని ప్రత్యేకంగా ప్రకటించారు. ఇక్కడ గమనించాల్సింది ఏంటంటే మొదటిసారి చేసిన యూరిన్ టెస్ట్ రిపోర్ట్ ను 10 నిమిషాల్లో బయటికి చెప్పగా రెండవ సారి చేసిన యూరిన్ టెస్ట్ రిపోర్ట్ 5 గంటల తర్వాత బయట పెట్టడం. ఇక్కడే ఖచ్చితంగా కుట్ర కోణం ఉందని అనుమానాలు బలపడుతున్నాయి. ఇక్కడ అసలైన, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే బ్లడ్ శాంపిలే తీసుకోకుండా, బ్లడ్ రిపోర్ట్ పాజిటివ్ గా వచ్చిందని ఈగల్ ఎస్పీ ప్రకటించడం. చివరికి రిమాండ్ రిపోర్టులో కూడా ఎక్కడ కూడా బ్లడ్ టెస్ట్ ప్రస్తావన లేదు. కేవలం యూరిన్ టెస్టు అని మాత్రమే ఉంది. మరి బ్లడ్ టెస్ట్ చేయకుండానే పాజిటివ్ వచ్చింది అని ఎస్పీ ఎలా చెప్పారు ? ఇక్కడ అనేక సందేహాలు.. అనేక అనుమానాలు... పాజిటివ్ వచ్చింది యూరిన్ టెస్ట్ లోనా? లేదా బ్లడ్ టెస్ట్ లోనా? ఏలూరు ఎంపీ యూరిన్ శాంపిల్ ఎక్కడికి తీసుకెళ్లారు? పాజిటివ్ రావడం కోసం అందులో ఏదైనా కలిపారా? అయితే ఏలూరు ఎంపీ పై డ్రగ్ ముద్ర వేసేందుకు తీవ్రంగా ప్రయత్నించిన ఎస్పీ గిరిధర్ ఒకచోట పప్పులో కాలువేసారు. అదే.. బ్లడ్ టెస్ట్ లో ఏలూరు ఎంపీ కి పాజిటివ్ వచ్చిందని చెప్పడం. ఇక్కడే కచ్చితమైన కుట్ర ఉందని, ఇందులో ఈగల్ ఎస్పీ గిరిధర్ పాత్ర ఉందని అనుమానాలకు బలం చేకూరుతోంది . బ్లడ్ శాంపిల్ తీసుకోకుండానే, బ్లడ్ రిపోర్టులో పాజిటివ్ వచ్చిందని చెప్పిన ఎస్పీ, అదే నిజమైతే బ్లడ్ శాంపిల్ రిపోర్టు బయటపెట్టాలి. పొలిసు విచారణ ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత ఎంపీ రెండు గుర్తింపు పొందిన ప్రముఖ ల్యాబుల్లో ?సొంతంగా యూరిన్ టెస్టు చేయించినట్లు తెలిసింది. .. ఆ రిపోర్టు కాపీలను కూడా మనకు దొరికాయి. వీటిలో "నెగెటివ్" గా రిపోర్టు రావడం మీరు చూడొచ్చు... వీటితోపాటు, ఎంపీ పై కుట్ర కోణం అనుమానాలు రేగటానికి మరో బలమైన కారణం ఉంది. అదే, ఎంపీ ఆరోగ్యానికి సంబంధించిన సమాచారం. ఇది కూడా మనకు వచ్చింది. నాలుగేళ్ళ కిందట ఎంపీకి హార్ట్ ఆపరేషన్ జరిగింది. దీనికి సంబంధించిన రిపోర్టులు కూడా ఉన్నాయిఅయన ఇప్పటికీ రెగ్యులర్ గా మందులు వాడుతున్నారు. గుండె సమస్య ఉన్న వ్యక్తి కొకైన్ లాంటి డ్రగ్స్ వాడటం సాధ్యమేనా? సాధారణ మనిషి గుండె నిమిషానికి 70 నుంచి 100 సార్లు కొట్టుకుంటుంది. డ్రగ్స్ తీసుకున్నప్పుడు 150 నుంచి 200 వరకూ వెళ్ళిపోతుందని వైద్యులు చెబుతారు... మరి గుండె సమస్య ఉన్న వ్యక్తి డ్రగ్స్ తీసుకోవడం ఏ విధంగా సాధ్యం?

ఇప్పుడు తేలాల్సిన విషయాలు

1) ఎంపీ పై డ్రగ్ ముద్ర వేయాలనే కుట్ర వెనుక ఎవరున్నారు?
2) అసలు తలసాని అల్లుడు అని తెలుసుకున్న తర్వాతే ఎస్పీ 2వ సారి టెస్ట్ కు ఆదేశించారా? దానికి కారణం ఏంటి?
3) ఎస్పీ ఏలూరు ఎంపీ గురించి.. తలసాని అల్లుడు అంటూ ఫోన్ లో చెప్పిందేవరికి?
4) పాజిటివ్ వచ్చింది యూరిన్ టెస్ట్ లోనా? లేదా బ్లడ్ టెస్ట్ లోనా?
5) 2వ సారి కూడా యూరిన్ టెస్ట్ చేసి, బ్లడ్ టెస్ట్ లో పాజిటివ్ వచ్చిందని ఎందుకు చెప్పాల్సివచ్చింది?
6) అసలు బ్లడ్ టెస్ట్ చేస్తే రిమాండ్ రిపోర్ట్ లో, ఈఎఫ్ లో బ్లడ్ టెస్ట్ గురించి ఎందుకు రాయలేదు.

# కన్నెపల్లి మండలంలో రంజాన్ ఈద్ ఖా తోఫాల పంపిణీ

**బెల్లంపల్లి మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ మరియు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు ఆదేశాల మేరకు కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్, కన్నెపల్లి, ముత్తాపూర్, లింగాల గ్రామ పంచాయతీలలో ముస్లిం సోదరులకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ ఈద్ ఖా తోఫాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కన్నెపల్లి మండల అధ్యక్షుడు పప్పుల రామాంజనేయ, యూత్ కాంగ్రెస్ బెల్లంపల్లి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఏల్పుల రోహిత్ పాల్గొన్నారు.అలాగే జన్కాపూర్ సర్పంచ్ బోరిగామ వెంకటేష్, కన్నెపల్లి సర్పంచ్ గడ్డల జయలక్ష్మి వెంకటేష్, ముత్తాపూర్ సర్పంచ్ ఎండి మున్నాబి అంకూస్, లింగాల సర్పంచ్ ఆగాడి సత్తీష్, మాజీ జడ్పీటీసీలు కౌటారపు సత్యనారాయణ, అల్లి



మోహన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బోరిగామ జలపతి, బట్టు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పుల్లూరి రాజయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గురుండ్ల సాయి, ఉపసర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు అన్నారపు ప్రశాంత్, ఉప సర్పంచ్లు కోట



ఇంద్రమోహన్, రౌతు వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు దుగుట చంద్రయ్య, అజ్జు, రైషత్, పుల్లూరి అశోక్, మోహన్, ప్రకాష్, కొత్తకొండ సంతోష్, ఏదునూరి వెంకటేష్, రామగౌడ్, లక్ష్మణ్, చెండె గణేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి యాజమాన్యంపై ఏఐటీయూసీ ఆగ్రహం ఒప్పందాల అమలులో నిర్లక్ష్యం ఆరోపణలు

**బెల్లంపల్లి మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాలతో కుదిరిన ఒప్పందాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ స్థాయిలో జరిగిన టెక్చర్ మీటింగ్‌లు, కోడ్ ఆఫ్ డిసిప్లిన్ ఒప్పందాలు, ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ యాక్ట్ 1947 సెక్షన్ 12(3) ప్రకారం కుదిరిన అంగీకారాలను అమలు చేయకుండా యాజమాన్యం కాలయాపన చేస్తోందని విమర్శించారు.
అన్‌ఫెయిర్ లేబర్ ప్రాక్టీసెస్ కొనసాగిస్తూ కార్మికుల హక్కులను ఉల్లంఘిస్తున్నారని, చట్టంలోని ఐదవ షెడ్యూల్ నిబంధనలు పాటించకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సెక్షన్ 25ఘ ప్రకారం ఇవి నిషేధితమైనప్పటికీ యాజమాన్యం పట్టించుకోవడం లేదని, సెక్షన్ 25ఖ ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
గుర్తింపు కార్మిక సంఘంతో సద్భావన వాతావరణంలో కుదిరిన ఒప్పందాలను అమలు చేయకపోవడం వల్ల పారిశ్రామిక



ప్రశాంతత దెబ్బతింటోందని తెలిపారు. కంపెనీ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం వెంటనే ఒప్పందాలను అమలు చేయాలని సూచించారు.
ఇంకా పలు డిమాండ్లను ఆయన ప్రస్తావించారు. నెలవారీ మెడికల్ బోర్డులను నిర్వహించి కారుణ్య నియామకాలు ఇవ్వాలని, కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కోల్ ఇండియా తరహాలో కార్మికుల ఇన్‌కమ్ ట్యాక్స్‌ను కంపెనీ భరించాలని, నూతన గనులను ప్రారంభించి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.
అదనంగా, కార్మికులకు సొంతింటి పథకాన్ని అమలు చేయాలని, డిస్మిస్ అయిన కార్మికులకు మరో అవకాశం ఇవ్వాలని, నాణ్యమైన పనిముట్లు అందించాలని కోరారు. ఏరియా ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు.
సింగరేణిలో ఉన్న బొగ్గు వనరులను వినియోగించేందుకు పలు గనులను వెంటనే ప్రారంభించాలని యాజమాన్యాన్ని కోరారు. అలాగే ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
మార్చి 18 నుండి 30 వరకు నిర్వహిస్తున్న "సేవ్ సింగరేణి" చైతన్య యాత్రకు కార్మికులు పెద్ద ఎత్తున మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని మిట్టపల్లి వెంకటస్వామి పేర్కొన్నారు.

# జర్నలిస్టులకు వెంటనే ఇండ్ల స్థలాలు కేటాయించాలి

**- ప్రభుత్వం మేనేపేస్టోలో పెట్టిన విధంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి**

**- 23.02 ఎకరాల భూమిని వెంటనే జర్నలిస్టులకు అప్పగించాలి**

**(జర్నలిస్ట్ ఫైల్) ఖమ్మం మార్చి 20 :**
గత 25 సంవత్సరాలుగా జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్నారని ఆ పోరాటానికి ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ జర్నలిస్ట్ యూనియన్ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నారపోగు వెంకటేశ్వర్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఖమ్మం ప్రెస్ క్లబ్ లో నిరాహార దీక్ష చేస్తున్న సీనియర్ జర్నలిస్ట్ కొరకొప్పుల రాంబాబుకు గురువారం సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ప్రభుత్వం ఏర్పడక ముందు పొంగులేటి శ్రీనివాసరెడ్డి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు బిఆర్ఎస్ పాలకులారా మీరిస్తారా నన్ను ఇవ్వమంటారా అని ప్రశ్నించారు. మీరివ్వకుంటే జర్నలిస్టులకు నేనే కట్టించి




ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ విస్మరించారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జర్నలిస్టులు వినతి పత్రాల ద్వారా అభ్యర్థిస్తూ వస్తూ ఉంటే అనేకసార్లు హామీలిస్తూ.. అమలులో మాత్రం సిత్తశుద్ధి చూపించడం లేదన్నారు. గత ప్రభుత్వం ఖమ్మం జర్నలిస్టులకు 23.02 ఎకరాల భూమిని కేటాయించింది కానీ అప్పగించలేదు. ఆ భూమిని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని కోరారు. మంత్రులు ఇలా అనేకమార్లు హామీలు ఇస్తున్నారు కానీ ఇళ్ల స్థలాలు మాత్రం జర్నలిస్టులకు ఇవ్వడం లేదు. ఇలా ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాల గడిచిపోయింది. కిరాయి ఇండ్లలో జీవనం గడుపుతూ కిరాయి కట్టలేక జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఖమ్మం ప్రెస్ క్లబ్లో సీనియర్ జర్నలిస్టు కొరకొప్పుల రాంబాబు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని గత నాలుగు రోజులుగా నిరాహార దీక్షలు చేస్తుంటే జర్నలిస్ట్ యూనియన్ నాయకులు, సీనియర్ జర్నలిస్టులు పట్టించుకోకపోవడం, స్పందించకపోవడం హాస్యాస్పదమన్నారు. యూనియన్ కార్యక్రమాలలో జర్నలిస్టులు కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నారని గుర్తు చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించలేని పరిస్థితిలో యూనియన్ నాయకులు ఉన్నారంటే చాలా బాధాకరం. జర్నలిస్టుల పక్షాన వారి సంక్షేమం కోసం పోరాడే యూనియన్లు అయితే వెంటనే ఐకమత్యంతో కార్యచరణ చేసి జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు సాధనకు కృషి చేయాలని యూనియన్ నాయకులకు పిలుపునిచ్చారు. నిరాహారదీక్ష కు మద్దతు తెలిపిన వారిలో టీ మీడియా చైర్మన్ శనగపాటి మురళికృష్ణ, తోట గణేష్, సాయి, నీరుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ తోఫాలు పంపిణీ చేసిన మున్సిపల్ వైస్ చైర్మన్ రాగం శెట్టి సత్యనారాయణ

**బెల్లంపల్లి మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి పట్టణంలోని 17వ వార్డులో ముస్లిం కుటుంబాలకు మున్సిపల్ వైస్ చైర్మన్ రాగం శెట్టి సత్యనారాయణ తోఫాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ నెలలో ముస్లిం సోదరులు కఠిన ఉపవాస దీక్షలు ఆచరిస్తూ అల్లాపై తమ భక్తిని చాటుకోవడం గొప్ప విషయమన్నారు. అలాంటి పవిత్ర సందర్భంలో వారికి తోఫాలు అందించడం సంతోషంగా ఉందని తెలిపారు.అలాగే రంజాన్ పండుగ ప్రతి ఇంటిలో ఆనందం, శాంతి, సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. సమాజంలో సౌహార్దత, సోదరభావం పెంపొందాలని కోరారు. ఈ తరహా కార్యక్రమాలు మానవత్వాన్ని మరింత బలోపేతం



చేస్తాయని పేర్కొన్నారు.
కార్యక్రమంలో వార్డు ప్రముఖులు, స్థానిక నాయకులు, ముస్లిం



కుటుంబాల లబ్ధిదారులు పాల్గొన్నారు. వారు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ వైస్ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# కారేపల్లిలో మల్లు స్వరాజ్యం వర్ధంతి..



**సింగరేణి మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు,ఐద్వా వ్యవ స్థాపకుల్లో ఒకరైన మల్లు స్వరాజ్యం జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని ఐద్వా వైరా డివిజన్ అధ్యక్షురాలు కొండబోయిన ఉమావతి అన్నారు.స్వరాజ్యం 4వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం కారేపల్లిలో ఆమె చిత్రపటాల వద్ద ఐద్వా నాయకురాళ్లు నివాళులర్పించారు. ఈసందర్భంగా ఉమావతి మాట్లాడుతూ,మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తిని కొనియాడారు. 12 ఏళ్ల వయస్సులోనే వెట్టి చాకిరీ, బానిసత్వానికి వ్యతిరేకంగా నాటి దొరలు, జాగీరుదారులపై పోరాటం చేసిన గొప్ప నాయకురాలన్నారు. తుది శ్వాస విడిచే వరకు ఎర్ర జెండా నీడలో, పేదల పక్షాన నిలిచారన్నారు. ఆమె చూపిన పోరాట స్ఫూర్తితో మహిళా హక్కుల కోసం పోరాడుదాం అన్నారు . ఈకార్యక్రమంలో ఐద్వా నాయకురాలు చిత్తారు రమాదేవి, ఇదిగాని అనిత, ఏనుగుల పద్మ, కొండబోయిన రమ్య, ఇదిగాని లింగమ్మ, శ్రావ్య, శారద

# 2వ వార్డులో ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ

**బెల్లంపల్లి మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
బెల్లంపల్లి పట్టణంలోని 2వ వార్డులో కౌన్సిలర్ నిచ్చకోల వంశీ క్రిష్ణ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రంజాన్ పండగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్ మరియు మున్సిపల్ చైర్మన్ దావా స్వాతిరమేష్ ఆదేశాల మేరకు అమలు చేశారు.ఈ సందర్భంగా 2వ వార్డులోని ముస్లిం కుటుంబాల ఇళ్ల వద్దకు వెళ్లి రంజాన్ తోఫాను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నిచ్చకోల వంశీకృష్ణతో పాటు నియోజకవర్గ సీనియర్ మైనారిటీ నాయకులు వాజిద్, వార్డ్ మైనారిటీ సభ్యులు షఫీ, అంకుస్, జమీల్, గౌస్, సర్వర్, శశి కపూర్, చాంద్ పాషా, అహ్మద్, అజారుద్దీన్, తన్వీర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీనియర్ నాయకులు దెబ్బటి రమేష్, పానికంటి చంద్ర మొగిలి, రేగుంట రాజలింగు మరియు బస్తీ ప్రజలు పాల్గొన్నారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయం వారికి ఎంతో ఉపయోగపడుతుందని నాయకులు తెలిపారు.



# ఈనెల 23 భగత్ సింగ్,రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సభలు...

**సింగరేణి మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
దేశ విముక్తి కోసం ఉరికంబాన్ని చిరునవ్వుతో ముద్దాడిన విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ల ఆశయాలకు ఊపిరి పోద్దామని పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్వీ రాకేష్ అన్నారు. గురువారం సింగరేణి మండలం టేకులగూడెం గ్రామంలో జరిగిన సమావేశంలో రాకేష్ మాట్లాడుతూ అమరుల 95వ వర్ధంతిని పురస్కరించుకుని పివైఎల్ పీడీఎస్ యు ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల మార్చి 23 నుండి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా వర్ధంతి సభలు నిర్వహిస్తున్నట్లు ఎన్వీ రాకేష్ తెలిపారు. ప్రస్తుత సమాజంలో రాజ్యమేలుతున్న సామ్రాజ్యవాద ధోరణులపై మరియు యువత ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటం చేయడమే అమరవీరులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ప్రపంచవ్యాప్తంగా యుద్ధోన్మాదాన్ని రగిలిస్తూ దేశాల సార్వభౌమాధికారాన్ని కాలరాస్తున్న అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా యువత గళమెత్తాలన్నారు.విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే విధంగా ఉన్న నూతన జాతీయ విద్యా విధానం – 2020 ను కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను కాపాడుకోవడమే మనందరి లక్ష్యం కావాలన్నారు. దేశంలో చదువుకున్న 25 కోట్ల మంది యువతకు ఉద్యోగాలు ఇవ్వలేని చేతకాని పాలన సాగుతోందని, నిరుద్యోగ యువతకు వెంటనే ఉపాధి కల్పించి వారి శ్రమకు తగిన గౌరవం ఇవ్వాలన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, నేటి దోపిడీ పాలనకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా




వారం రోజుల పాటు జరిగే ఈ పోరాట సభలు విజయవంతం చేయాలనికోరారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టేకులగూడెం సర్పంచ్ గుమ్మడి సందీప్, పివైఎల్ డివిజన్ నాయకులు కనకరాజు, ప్రకాష్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# హిందూ వాహిని ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ



**(జర్నలిస్ట్ ఫైల్) రామ్ మందిర్ ఏరియా మార్చి 20 :**
గోదావరిఖనిలో హిందూ వాహిని శాఖ ఆధ్వర్యంలో తెలుగు నూతన సంవత్సరం శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా ప్రధాన చౌరస్తాలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికారు.వేడుకలలో భాగంగా ప్రజలకు సంప్రదాయబద్ధంగా ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంయోజక్ రాగం శ్రీధర్, కొండ ప్రేమ, స్వరాజిత్, రిషి, రిషిక్ హిందూ వాహిని కార్యకర్తలు పాల్గొన్నారూ

# సుద్దపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో ఉగాది వేడుకలు. సర్పంచ్ లక్ష్మణ్

**పెగడపల్లి మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
జగిత్యాల జిల్లా పెగడపలి మండలం సుద్దపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ ఐతర వేణి లక్ష్మణ్ ఆధ్వర్యంలో షడ్రుచులతో తయారు చేసిన పచ్చడిని స్వీకరిస్తూ ఉగాది పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయ అర్చకులు గోపి పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు.పరాభవ నామ సంవత్సరానికి సంబంధించిన గ్రహ స్థితులు, రాశి ఫలాలు, ప్రజల జీవన విధానంపై వాటి ప్రభావాలను వివరించారు.కొత్త సంవత్సరంలో ప్రజలకు సుభిక్షం, శాంతి, ఐశ్వర్యం కలగాలని అన్నారు.పరాభవ నామ సంవత్సరంలో శుద్ధపల్లి గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ శుద్దపల్లి గ్రామ ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజలు ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇతర వేణి లక్ష్మణ్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, గ్రామ కుల సంఘం పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన.చైర్మన్ కుమార్ గౌడ్

**గుమ్మడిదల, మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, రైతులు, కార్మికులు, వ్యాపారులు, యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డు కౌన్సిలర్లు, నాయకులు మరియు సమస్త వర్గాల వారికి హృదయపూర్వక ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. తెలుగు నూతన సంవత్సరమైన పరాభవ నామ సంవత్సరం ప్రతి కుటుంబానికి ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం తీసుకురావాలని కోరుకుంటున్నాను.రైతులకు మంచి దిగుబడులు లభించాలని, యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలని, మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని కోరుకుంటున్నాను. అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డు కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేసి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని కోరుకుంటున్నాను. పరాభవ నామ సంవత్సరం అందరికీ శాంతి, సుభిక్షం తీసుకురావాలని కోరుకుంటున్నాను.



# రాష్ట్రంలో తొలి స్థానం సాధించిన శ్రీహర్షకు ఉగాది వేదికగా ఘన సన్మానం









**నిర్మల్ జిల్లా ప్రతినిధి మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
నూతన సంవత్సర శుభాకాంక్షల సందర్భంగా ఉగాది ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభకు గౌరవం లభించింది. 2024,25 విద్యాసంవత్సరంలో బైపీసీ విభాగం ప్రథమ సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించిన నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన బి. శ్రీహర్షను జ్ఞాపికతో పాటు షాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు శ్రీహర్ష ప్రతిభను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# రంజాన్'తోఫాను అందజేసిన 5వ వార్డు కౌన్సిలర్ భాగ్యలక్ష్మీ శివ



**(జర్నలిస్ట్ ఫైల్) వనపర్తి జిల్లా ప్రతినిధి మార్చి 20 :**
పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పెబ్బేరు మున్సిపల్ పరిధిలోని చెలిమిల్ల 5వ వార్డు కౌన్సిలర్ భాగ్యాలక్ష్మీ ముస్లిం సోదరులకు రంజాన్ తోపాను అందజేశారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి శివ మాట్లాడుతూ అన్ని మతాల పండుగలను గౌరవించడం మన భారతదేశ సంప్రదాయమని, రంజాన్ పర్వదినం క్రమశిక్షణకు, దాతృత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ భాగ్యలక్ష్మి శివ,మాజీ డైరెక్టర్ రాముడు, అల్వాల రాజా గౌడ్,బూత్యార్ కురుమూర్తి, బుల్లెట్ రాముడు, దేవన గౌడ్,కంచే ఆంజనేయులు, కంచె హరికృష్ణ, బి.కృష్ణయ్య,జి.పరుశారాముడు, టైలర్ రాజు,కంచె తిరుపతయ్య నాయుడు,నరేష్ గౌడ్,గంధం అంజి,పెద్దిగారి రాములు, టి.కృష్ణయ్య,లోకేష్ గౌడ్,శివయ్య నాయుడు, ముస్లిం పెద్దలు, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 20,21 వ తేదీలలో రెండు రోజుల పాటు తిరుమల తిరుపతి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

### పర్యటనపై సమీక్షా - ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో చిన్నపాటి లోపాలకు తావివ్వరాదు: జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్

**తిరుమల / తిరుపతి , మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఈ నెల 20,21 వ తేదీలలో రెండు రోజుల పర్యటన నిమిత్తం. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబం సమేతంగా తిరుపతి, తిరుమలకు రావడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్. పేర్కొన్నారు.బుధవారం సాయంత్రం తిరుమల శ్రీ పద్మావతి అతిథి గృహం నందు జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు,టి టి డి సి వి అండ్ ఎస్ ఓ మురళి కృష్ణ తో కలసి ASL లో ( ముందస్తు భద్రత లైజన్ ) భాగంగా జిల్లా కలెక్టర్ డా, ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి పర్యటన భద్రత ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి పర్యటించు ప్రాంతాలను ,ఎస్పీ సుబ్బరాయుడు, సి వి అండ్ ఎస్ ఓ. మురళి కృష్ణ సంబంధిత అధికారులతో కలిసి గొల్లమండపం, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం తిరుమల తిరుపతి దేవస్థానము వారు నూతనంగా నిర్మించిన నీరు మరియు ఆహార విశ్లేషణ ప్రయోగశాల స్టేట్ ఫుడ్ లాబొరేటరీలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టి టి డి అధికారులు, ఏఎస్పీలు తిరుపతి, ఆర్డీవో రామ్మోహన్, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య, ఫుడ్ సేఫ్టీ అధికారులు, సంబంధిత అధికారులు,తహశీల్దార్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## నర్సీపట్నం లో ఏ. పి. ఎం. ఎఫ్ డైరీ ఆవిష్కరణ



**నర్సీపట్నం, మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నర్సీపట్నంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (APMF) డైరీ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయులు, టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ చింతకాయల రాజేష్ ముఖ్య అతిథిగా పాల్గొని డైరీని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చింతకాయల రాజేష్ మాట్లాడుతూ, మీడియా సమాజానికి అద్దంలాంటిదని, ప్రజలకు నిజమైన సమాచారాన్ని అందించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. జర్నలిస్టులు నిబద్ధతతో పనిచేస్తూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని, భవిష్యత్తులో మరింత సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.ఈడైరీ ఆవిష్కరణలో రావనపల్లి రిజర్వాయర్ చైర్మెన్ రుత్తల రాజేశ్వరరావు మరియు ఎ పి ఎం ఎఫ్.సభ్యులు జి టి వి ఎస్ ఆర్ కె. రాజు,కె రాజశేఖర్, బి రామ్ కుమార్ పాల్గొన్నారు.

## చీరాల డీఎస్పీ సహా జిల్లాకు చెందిన 8 మంది పోలీస్ అధికారులకు ఉగాది పురస్కారాలు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం..



### ఉగాది పురస్కారాలు పొందనున్న పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్...

**బాపట్ల, మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
బాపట్ల జిల్లా పోలీస్ శాఖలో విధి నిర్వహణలో అసాధారణ ప్రతిభ, అంకితభావం కనబరిచిన ఎనిమిది మంది పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాలను ప్రకటించింది. జిల్లా పోలీస్ యంత్రాంగానికి గర్వకారణంగా నిలిచిన ఈ పురస్కారాల జాబితాను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది. క్షేత్రస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారిని ఈ అవార్డులకు ఎంపిక చేశారు..

## బాపట్ల జిల్లా లో ఎండలు ముదరకముందే నీటి కష్టాలు..

- అక్రమ వాటర్ పాయింట్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా వాసుల డిమాండ్
- అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నీటి వృథా చేస్తున్న సర్వీసింగ్ సెంటర్లు
- నిబంధనలకు విరుద్ధంగా భూగర్భ జలాల వ్యాపారంపై మండిపడుతున్న ప్రజలు
- జిల్లా యంత్రాంగం, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని విన్నపం

**బాపట్ల, మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
వేసవి కాలం ప్రారంభంలోనే బాపట్ల లో నీటి ఎద్దడి ఛాయలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఎండలు తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో, పట్టణంలోని పలు ప్రాంతాలలో అక్రమంగా నిర్వహిస్తున్న వాటర్ పాయింట్లు, సర్వీసింగ్ సెంటర్ల వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన వీధులు శివారు ప్రాంతాలలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే అనేక చోట్ల అక్రమంగా బోర్లు వేసి నీటిని వాణిజ్య అవసరాలకు వాడుతున్నారు. ముఖ్యంగా అనుమతులు లేని సర్వీసింగ్ సెంటర్లలో వాహనాలను కడిగే నెపంతో రోజూ వేల లీటర్ల నీటిని వృథా చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా భూగర్భ జలాలను తోడేసి, ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తూ అక్రమ వ్యాపారానికి తెరలేపారు. అక్రమ బోర్లు, మితిమీరిన నీటి వాడకం వల్ల సామాన్య ప్రజల ఇళ్లలోని బోర్లు ఎండిపోతున్నాయని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి ముదిరితే తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. మున్సిపల్ యంత్రాంగం జిల్లా అధికారులు ఈ అక్రమ వాటర్ పాయింట్లపై తక్షణమే దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. అనుమతులు లేని సర్వీసింగ్ పాయింట్లను, వాటర్ ప్లాంట్లను వెంటనే తొలగించాలి.
అక్రమంగా బోర్లు వేసి నీటిని విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పట్టణంలో తనిఖీలు చేపట్టాలి. నీటిని వృథా చేసే సర్వీసింగ్ సెంటర్ల లైసెన్సులను రద్దు చేయాలి" అని బాపట్ల వాసులు డిమాండ్ చేస్తున్నారు.

## ఉగాది అవార్డులందుకున్న 'అనంత' వాసులు



**అనంతపురము, మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
శ్రీ పరాభవ నామ ఉగాది వేడుకల సందర్భంగా నలుగురు అనంతవాసులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారికి శాలువా, తెలుగుతల్లి జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో పాటు పదివేల రూపాయల నగదు కూడా అందజేశారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉగాది అవార్డు అందుకున్న వారిలో వసంత కిరణ్ రాయసం, (కూచిపూడి, భరతనాట్యం), తిరుపాల్ నాయక్, (నాటకరంగం), ఉరుముల సోమశేఖర్, (జానపదం - ఉరుములు), ఏమినేని రవిచంద్ర, (జర్నలిజం) తదితరులున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉగాది వేడుకల్లో జిల్లాకు చెందిన ప్రముఖ సహస్రావధాని, అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షులు మాడుగుల నాగఫణి శర్మ పంచాంగ శ్రవణం చేశారు. నలుగురు అనంతవాసులు ఉగాది అవార్డు అందుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ గ్రంథాలయ పరిషత్ పూర్వ సభ్యులు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు అవార్డు గ్రహీతలను కలిసి విజయవాడలో ప్రత్యేకంగా అభినందించారు.

## శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

**తిరుపతి/తిరుమల, మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు వి. వీరబ్రహ్మం, డా. ఎ. శరత్ భక్తులకు, ఉద్యోగులకు, అర్చకులకు, ప్రజలకు నూతన తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరాన్ని ఆనందంగా, భక్తి భావంతో జరుపుకోవాలని వారు కోరుకున్నారు. శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## ధర్మవరం రాజకీయాల్లో నవతరం పార్టీకి బలమైన అడుగు

### : షేక్ అయాజ్ జిల్లా అధ్యక్షుడిగా నియామకం



**ధర్మవరం, మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
నవతరం పార్టీ ఫౌండర్ & నేషనల్ ప్రెసిడెంట్ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం గారు, 2024 ధర్మవరం అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన షేక్ అయాజ్ ను శ్రీ సత్య సాయి జిల్లా నవతరం పార్టీ అధ్యక్షులుగా నియమించారు.
ఈ నియామకం పట్ల పార్టీ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. షేక్ అయాజ్ గతంలో పార్టీ కోసం చేసిన కృషి, ప్రజలతో ఉన్న అనుబంధం, నాయకత్వ లక్షణాలను గుర్తించి ఈ పదవిని అప్పగించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.ఈ సందర్భంగా రాయలసీమ ఇంచార్జ్ గాజుల మురళి కృష్ణ మరియు అనంతపురం జిల్లా అధ్యక్షులు మునగాల సునీల్ కుమార్ అయాజ్ కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. జిల్లా అధ్యక్షునిగా ఆయన నియామకానికి తాము కృషి చేసినట్లు వారు వెల్లడించారు.అలాగే పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కూడా అయాజ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో నవతరం పార్టీ జిల్లాలో మరింత బలపడుతుందని, ప్రజలకు సేవ చేసే కార్యక్రమాలు మరింత వేగవంతం అవుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.షేక్ అయాజ్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, జిల్లా అభివృద్ధి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రతి కార్యకర్తను కలుపుకుని పార్టీని గ్రామ స్థాయి వరకు బలోపేతం చేయడం తన లక్ష్యమని పేర్కొన్నారు.

## స్పీకర్ అయ్యన్నపాత్రుడు నివాసంలో ఘనంగా ఉగాది వేడుకలు

### :పండుగల నిర్వహణపై కీలక సూచనలు









**నర్సీపట్నం, మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నివాసంలో శ్రీ "పరాభవ" నామ సంవత్సర ఉగాది వేడుకలు, పంచాంగ శ్రవణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో స్పీకర్ సతీమణి, కౌన్సిలర్ పద్మావతి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, ఆయన సతీమణి డాక్టర్ సువర్ణ, అలాగే చింతకాయల రాజేష్, ఆయన సతీమణి దివ్య రాజేష్ తదితర కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య చింతకాయల రాజేష్ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, పండితులు నూతన సంవత్సర పంచాంగ శ్రవణాన్ని పఠించారు. ఈ శుభ సందర్భంగా ఇటీవల నూకాంబిక అమ్మవారి పండుగను అత్యంత వైభవంగా, విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను స్పీకర్ అయ్యన్నపాత్రుడు, విజయ్, రాజేష్ లు ఘనంగా సత్కరించారు. అనంతరం విచ్చేసిన వారందరికీ ఉగాది పచ్చడి, పులిహోర, తీపి పదార్థాలను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. నూకాంబిక అమ్మవారి పండుగను మునుపెన్నడూ లేని విధంగా అత్యంత వైభవంగా నిర్వహించామని, నర్సీపట్నంలో నిర్వహించిన పబ్లిక్ సర్వేలో కూడా ప్రజలంతా ఈ పండుగ పట్ల ఎంతో సంతోషం వ్యక్తం చేశారని స్పష్టం చేశారు. ఈ విజయం ఏ ఒక్కరిదో కాదని, రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరిదీ అని ఆయన కొనియాడారు. పండుగకు సహకరించిన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా భక్తులకు సేవలందించిన వారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పండుగ ఖర్చులు పోనూ అమ్మవారికి నిధులు కూడా మిగిలాయని, భక్తులు వేసిన కానుకలతో హుండీ ఆదాయం పెరిగిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.
త్వరలో జరగనున్న మరిడమ్మ పండుగ గురించి కూడా ఆయన పలు కీలక సూచనలు చేశారు. పండుగ నిర్వహణ విధానంలో కాలానుగుణంగా మార్పులు తీసుకురావాలని సూచించారు. గురు, శుక్ర, ఆదివారాల్లో కుంకుమ పూజలు నిర్వహించడం ద్వారా ఆలయానికి మరింత ఆదాయం సమకూర్చే అవకాశాలను పరిశీలించాలన్నారు. రాబోయే మరిడమ్మ పండుగను కూడా ప్రజలందరి సహకారంతో సమిష్టిగా, అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

## అభివృద్ధి.. సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్ళు!













- శ్రీ పరాభవ నామ ఉగాది వేడుకల్లో పాల్గొన్నా మంత్రి సవిత ,జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ,జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్
- ఉట్టిపడిన తెలుగు సంప్రదాయం
- ఆలోచింపజేసిన కవి సమ్మేళనం.. పంచాంగ శ్రవణం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**పుట్టపర్తి మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరామంలో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో గురువారం నాడు శ్రీ పరాభవ నామ ఉగాది పర్వదిన వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. అడుగడుగునా తెలుగు సంప్రదాయం ఉట్టి పడిన ఉగాది వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి సవిత, విశిష్ట అతిథిగా జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఆత్మీయ అతిథులుగా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, ఏఎస్పీ అంకిత సురానా, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, డీఆర్వో విజయ సారథి, ఆర్డీవో సువర్ణ, పర్యాటక శాఖ అధికారి నరసయ్య, ప్రతాప్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉండేవారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన కూడా రాయల సుపరిపాలనను గుర్తుకు తెస్తోందన్నారు. శాంతి భద్రతలతో పాటు, ఉద్యోగ, ఉపాధి కల్పన ద్వారా రాష్ట్రాన్ని ప్రగతి పథకం దిశగా నడిపిస్తున్నారని మంత్రి కొనియాడారు. జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదనం అంటే మొదట గుర్తుకొచ్చే పండుగ ఉగాది అన్నారు. ఆబాల గోపాలం ఉగాది వేడుకల్లో పాలు పంచుకోవడం ఆనందదాయకమన్నారు. జిల్లాను సమగ్ర అభివృద్ధి దిశగా నడిపించడంతోపాటు, పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. మనుషులను కలిపే గొప్ప వేడుకలన్నారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ తెలుగు నేలపై ఉగాది సంబరాలు కుటుంబ సంబంధాలను బలోపేతం చేస్తున్నాయన్నారు. ప్రతిఒక్కరూ సంప్రదాయ వస్త్రధారణలో ఉగాది వేడుకలకు హాజరు కావడం చూడముచ్చటగా ఉందన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ సత్యసాయిబాబా నడయాడిన పుట్టపర్తి నేలకు గొప్ప మహత్యం ఉందన్నారు. ప్రాచీన కళలు, సాహిత్యం, సంప్రదాయాల మేలు కలయికగా అద్భుతంగా ఉగాది వేడుకలు నిర్వహించారని జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం ఉగాది పచ్చడిని అందరికీ పంచి పెట్టారు. ప్రత్యేక పూజల అనంతరం నిర్వహించిన పంచాంగ శ్రవణం, ఉగాది కవి సమ్మేళనం ఆలోచింపజేశాయి. వివిధ రంగాలలో సుదీర్ఘ సేవలందించిన ఏలూరు వెంకన్న సాహిత్యం, డాక్టర్ జాగర్లపూడి శ్యామసుందర శాస్త్రి వ్యాఖ్యాన రంగం, పరిసె సుధాకర్, పోస్ట్ మెన్ అల్లా బకాష్ ను మంత్రి, కలెక్టర్ తదితరులు ఘనంగా సత్కరించారు.
కవులు జాబిలి జయచంద్ర, డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్, వల్లం రమేష్ బాబు, కొండసాని రజిత, డాక్టర్ శివన్న, శోభామణి, మాణిక్యం ఇషాక్, ముద్ద రంగప్ప ఆలపించిన కవితలు అలరించాయి. చిన్నారులు రామ లాలిత్య, మానస బృందం ప్రదర్శించిన కూచిపూడి స్వాగత నృత్యాలు, బాలికల కోలాటం ఎంతగానో ఆకట్టుకున్నాయి. కవులు, కళాకారులను మంత్రి ఆత్మీయంగా సత్కరించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నలుగురు అర్చకులకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ క్రాంతి, డీఈవో కిష్టప్ప, పర్యాటక శాఖ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పద్మనాభం, శ్రీకాళహస్తి ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే సింధూర రెడ్డి పీఏ లక్ష్మీనారాయణ, నాట్యాచార్యులు బాబూ బాలాజీ, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



## సీఎం చంద్రబాబు పోటోకు దివ్యాంగులు పాలాభిషేకం

**ఓడి చెరువు, మార్చి 20 (జర్నలిస్ట్ ఫైల్) :**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దివ్యాంగుల కు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించడం పట్ల గురువారం మండలంలోని దిగువ పల్లి లో దివ్యాంగులు లోక్ నాథ్ టిడిపి నాయకులు అంజినప్ప ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుడు లోక్ నాథ్ టిడిపి నాయకులు అంజినప్ప లు మాట్లాడుతూ దివ్యాంగులకు అండగా రూ.. 6000 పెన్షన్ లు అందజేస్తూ రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం సంతోషదాయకమని కూటమి ప్రభుత్వంలో దివ్యాంగులకు చేయూత నిస్తూ అండగా నిలుస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు రాకేష్ దేరంగుల రాజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన పెద్ద పీరయ్య స్వామి ఆరాధన మహోత్సవాలు



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ): ఆధ్యాత్మిక వైభవానికి నిలయమైన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ప్రియ శిష్యులు శ్రీ సిద్దయ్య స్వాముల వారి నాలుగవ కుమారుడు శ్రీ పెద్ద పేరయ్య స్వాముల వారి ఆరాధన మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా సిద్దయ్య గారి మఠంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను శనివారం టిడిపి నాయకులు వైభవంగా ప్రారంభించారు. ఈ పోటీలను బ్రహ్మంగారిమఠం టీడీపీ మండల అధ్యక్షులు చెన్నుపల్లె సుబ్బారెడ్డి కడప జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జునరెడ్డి గారు జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో పాటు గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు. సిద్దయ్య స్వామి వారి వారసత్వాన్ని కొనసాగిస్తూ పెద్ద పీరయ్య స్వామి ఆరాధన వేడుకలను ప్రతి ఏటా గ్రామస్థులు భక్తులు ఉత్సాహంగా నిర్వహించడం చూస్తుంటే ఆ ప్రాంత భక్తి స్ఫూర్తి చాటిచెబుతోందని కొనియాడారు. బండలాగుడు పోటీల్లో పాల్గొనేందుకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుండి రైతులు తమ బలమైన ఎడ్ల జతలతో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు మఠం మండల ప్రతినిధులు మరియు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పోటీలను తిలకించేందుకు వచ్చిన భక్తులతో సిద్దయ్య గారి మఠం పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

## చెంచుపేట ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్ధనలకు సర్వం సిద్ధం



- ఈద్గా కమిటీ అధ్యక్షులు షేక్ జానీ

తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా మైదానంలో నిర్వహించే సామూహిక ప్రార్ధనలకు ముస్లింసోదరులందరూ సమయపాలన పాటించి సకాలంలో ఈద్గా మైదానానికి చేరుకోవాలని ఈద్గా కమిటీ అధ్యక్షులు షేక్ జానీ తెలియజేశారు. రంజాన్ మాస ఉపవాస దీక్షలు ముగిసిన నేపథ్యంలో శనివారం రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఎంతో ఘనంగా నిర్వహించుకునే క్రమంలో, చెంచుపేటలోని ఈద్గా మైదానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక ప్రార్ధనలకు వచ్చే ముస్లిం సోదరులకు మౌలిక వసతులు కల్పించారు. ప్రార్ధన సమయంలో ఎటువంటి అసౌకర్యం లేకుండా సౌకర్యాలు కల్పించారు. ఈ సందర్భంగా ఈద్గాకమిటీ అధ్యక్షులు షేక్ జానీ మీడియాతో మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటల లోపు, ముస్లిం సోదరులందరూ, సాంప్రదాయ రీతులో, ఈద్గా మైదానానికి చేరుకోవాలని, 9 గంటల 30 నిమిషాలకు ప్రార్ధన ప్రారంభ మవుతుందని తెలిపారు. సంఘీయులందరికీ ఈద్ ముబారక్ శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈద్గా మైదానంలోని ఏర్పాట్లను పరిశీలించారు. పోలీస్,మున్సిపల్ శాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. షేక్ జానీ వెంట కమిటీ బాధ్యులు షేక్ కాలేషా, షేక్ అబ్దుల్ కదీర్, షేక్ అబ్దుల్ రజాక్, పఠాన్ ఆలీఖాన్, షేక్ ఇపాయితుల్లా, సభ్యులు ఉన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు



- బీజేపీ ఆంధ్ర కోస్టల్ జోన్ ఇంచార్జ్ డా షేక్ అబ్దుల్ ఖుద్దుస్

కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ): ముస్లిం సోదర సోదరీమణులందరికీ రంజాన్ పర్వదిన –శుభాకాంక్షలు తెలిపుతున్నట్లు భారతీయ జనతా పార్టీ మైనారిటీ మోర్చా ఆంధ్ర కోస్టల్ జోన్ ఇంచార్జ్ డా షేక్ అబ్దుల్ ఖుద్దుస్ తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మానవాళి హితాన్ని ఆకాంక్షించే పవిత్రమయిన రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు అత్యంత భక్తి ప్రపత్తులతో జరుపుకోవాలని అన్నారు. ప్రతీ కుటుంబంలోనూ ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ అల్లహ్ దయతో అందరు సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. మత సామరస్యానికి, సర్వమత సౌభ్రాతృత్వానికి నెలవైన పవిత్ర రంజాన్ మాసం అని తెలిపారు. ప్రజల జీవితాల్లో సంతోషం తీసుకువచ్చిన సందర్భంగా, ప్రజలంతా ఆనందంగా పండుగ చేసుకోవాలని కోరుకుంటున్నట్లు తెలియజేసారు.

# ఈద్గాలను పరిశీలించిన ఎమ్మెల్యే నసీర్

- మంచినీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశం
- ముస్లిం మైనారిటీలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): సౌహార్ధం, శాంతి, సహనానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండుగ సమాజంలో ఐక్యతను పెంపొందిస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా శుక్రవారం గుంటూరు నగరంలోని నాలుగు ప్రదేశాలలో ఏర్పాటుచేసిన యుద్ధాలను ఎమ్మెల్యేల పరిశీలించారు. ఇదిగాల వద్ద మంచినీరు విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాల కల్పనపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. నమాజ్ ప్రార్ధనలకు వచ్చే ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. గుంటూరు నగరంలోని ఉర్దూ బాలుర హాస్టల్ వద్ద, ఐ పి డి కాలనీ వద్ద ఏర్పాటుచేసిన ఎగ్గ లో 9 గంటలకు రమేష్ హాస్పటల్ వద్ద ఈగ్గాలో తొమ్మిదిన్నర గంటలకు ముస్లిం కాలేజీ వద్దలో 10 గంటలకు నమస్కారాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఈద్గాలను పరిశీలించిన ఎమ్మెల్యే ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, శాంతి, సుభిక్షం నింపాలని ఆకాంక్షించారు. పేద ప్రజలకు చేతనైనంత సాయం అందించాలనే దయా గుణాన్ని ఖురాన్ నేర్పుతుందని పేర్కొన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ అవలంబించాలని కోరారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల ఆర్థిక అభ్యున్నతికి తోడ్పాటు అందించినట్లు తెలిపారు విద్య, ఉపాధి రంగాల్లో ముస్లిం మైనారిటీలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్లో 6 వేల కోట్ల పైగా నిధులు కేటాయించి ముస్లింల పక్షపాతి సీఎం చంద్రబాబు నాయుడు అని నిరూపించుకున్నారని వెల్లడించారు.

# శ్రీవారాహీ మాత ఆలయంలో భవన నిర్మాణ భూమిపూజ

- భూమిపూజలలో శ్రీవాసవీ పీఠం పీఠాధిపతులు శ్రీప్రజ్ఞానంద సరస్వతీస్వామీజి



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): శ్రీవారాహి మాత దివ్యానుగ్రహం కోసం భక్తులు సమర్పించే పొంగలిని,తయారు చేసుకునేందుకు వీలుగా అమ్మవారి భక్తుల ఆర్థిక వితరణతొ నిర్మించనున్న, భవనానికి భూమిపూజ శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి స్వీయపర్యవేక్షణలో నిర్వహించారు. కొల్లిపర మండలం కుంచవరం గ్రామంలో, పోస్ట్ స్వశ్చంద సంస్థ ప్రాంగణంలోని, శ్రీవారాహీ అమ్మవారి ఆలయంలొ శుక్రవారం ,హైదరాబాద్ వాసి,వంగాజయరామిరెడ్డి తనయుడు వంగా బ్రహ్మానందరెడ్డి భక్తిపూర్వక వితరణతొ, ఆలయానికి వచ్చు భక్తులు పొంగళ్ళు తయారు చేసుకునేందుకు వీలుగా,భవనం నిర్మించేందుకు, భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. పెనుగొండ శ్రీ వాసవీ పీఠంపీఠాధిపతులు శ్రీప్రజ్ఞానంద సరస్వతీ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించిన, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్వామీజి మీడియాతొ మాట్లాడుతు మహామాన్వితమైన అమ్మవారు, శ్రీవారాహీ అమ్మవారికి పొంగలి నివేదించడం ద్వారా భక్తుల ఇష్ట కామ్యాలు నెరవేరుతాయన్నారు. భక్తులు పొంగలి తయారు చేసుకునేందుకు వీలుగా భవనం నిర్మాణం చేపట్టేందుకు, ముందుకు వచ్చిన భక్తులకు శ్రీ వారాహీ అమ్మ ఆశీస్సులు మెండుగా లభించాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా తొలుత స్వామీజికి, ఆలయ నిర్వాహకులు తన్నీరు శ్రీనివాసబాబు నాగమల్లేశ్వరీ దంపతులు,పూర్ణ కుంభంతొ స్వాగతం పలికారు. అమ్మవారికి స్వామీజీ ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. యోగాచార్య ముద్దాబత్తుని రమణయ్య ఆధ్వర్యంలొ నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలొ బ్రహ్మానందరెడ్డి మాత్రుమూర్తి సీతాకుమారి, వారి కుటుంబ సభ్యులు,కమతం కోటయ్య, బసవ కోటేశ్వర్రావు,కల్యాణం శ్రీనివాసరావు, లక్ష్మి, మాణిఖ్యాలరావు, గ్రామంలోని భక్తులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలోనే నిరుద్యోగులకు భరోసా

- యువతకు ఉగాది కానుకగా కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్
- 20 లక్షల ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- జాబ్ క్యాలెండర్‌లో విద్య, పోలీస్ శాఖలకు అధిక ప్రాధాన్యత
- నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు బోగి వినోద్



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): కూటమి 20 నెలల పాలనలో 6 లక్షల 28 వేల ఉద్యోగాలు కల్పించినట్లు మంగళగిరి నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు బోగి వినోద్ తెలిపారు. టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో ఆయన శు క్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెంటర్ పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. మంత్రి నారా నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. జాబ్ క్యాలెండర్‌లో విద్య, పోలీస్ శాఖలకు ప్రాధాన్యత కల్పించినట్లు చెప్పారు. ఇప్పటికే మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశారని, మరోసారి డీఎస్సీతో పాటు జూనియర్ లెక్చరర్ పోస్టుల కోసం సుమారు 3,000 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఉన్నత విద్యను బలోపేతం చేయడానికి వివిధ విశ్వవిద్యాలయాల్లో 1,500 అధ్యాపక పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే గ్రూప్--1, గ్రూప్--2 కింద దాదాపు 600 పోస్టులు, 1,000 పోలీస్ కానిస్టేబుల్, 400 ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సిద్ధమైందని పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్ కేవలం ప్రకటన కాదు, నిరుద్యోగులకు భరోసా అని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థులు గందరగోళం లేకుండా ప్రణాళికాబద్ధంగా సిద్ధమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగాలు, ఎంఎస్ఎంఈలు, జాబ్ ఫెయిర్లు, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటక రంగాల ద్వారా లక్షలాది ఉపాధి అవకాశాలు కల్పించినట్లు వివరించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా రాష్ట్రానికి పరిశ్రమలు పెట్టుబడులు తీసుకురాకపోగా కమీషన్ల కోసం ఉన్న కంపెనీలను తరిమేసి 34 లక్షల మంది యువత భవిష్యత్‌ను నాశనం చేసిందని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు విద్యార్థి, యువతకు అన్ని విధాల అండగా నిలిస్తే జగన్ రెడ్డి మాత్రం తన అవినీతి, అరాచక పాలనతో విద్యార్థి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేసి యువత భవిష్యత్‌ని ప్రశ్నార్థకం చేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్, రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గుద్దంటి నాగేశ్వరరావు, తెలుగు యువత నాయకులు మేకల సుధీర్, గంట దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ శుభాకాంక్షలు : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): యావత్ ముస్లిం సమాజానికి శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి పవిత్ర రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ పర్వదినమని ఆయన పేర్కొన్నారు. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు కఠోర ఉపవాసం చేస్తూ, దైవ ప్రార్ధనలలో పాల్గొంటారన్నారు. అల్లా దయతో సకల మానవాళికి మంచి జరగాలని.. అల్లా అశీస్సులు ప్రజలందరిపై ఉండాలని.. మనస్ఫూర్తిగా కోరుకుంటూ కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ రంజాన్ జరుపుకోవాలన్న



ఆకాంక్షను లేళ్ళ అప్పిరెడ్డి వ్యక్తం చేశారు.

# సిద్దయ్యమఠంలో ఘనంగా వృషభరాజుల బండలాగుడు పోటీలు

- భక్తుల మధ్య బండలాగు పోటీ వృషభ రాజములకు ప్రారంభించిన జిల్లా పరిషత్ చైర్మన్ రామ గోవిందరెడ్డి





బ్రహ్మంగారి మఠం(జర్నలిస్ట్ ఫైల్ ):మూడమాల గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ శ్రీ సిద్దయ్య స్వామివారి కుమారుడు పెద్దపీర య్యస్వామి ఆరాధన మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు ఉదయం తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజలు పెద్దపీరయ్య స్వాములవారిశిష్యులు కీర్తిశేషులు కనపర్తి పాపిరెడ్డి సన్న పల్లె ఖాజీపేట మండలం పట్టు వస్త్రాలతో, గ్రామానికి చెందిన కొండయ్య మాధవరం సిద్దయ్యస్వామిలవారికి పిరయ్య స్వాముల వారికి వస్త్రాలంకరణ రాత్రికి గ్రామోత్సవం వైభవంగా భక్తుల మధ్య భక్తులకు దర్శనం ఇచ్చారు అనంతరం భక్తులకు ప్రత్యేకంగా సాంస్కృత కార్యక్రమాలను సినీ ఆర్కెస్ట్రా చిన్నాయపల్లి గ్రామ వాస్తవ్యులు సహాయంతో భక్తులకు ప్రత్యేకంగా సర్వమతాల అన్నదాన వారు కమిటీ మరి భక్తుల సహకారంతో నూతన నిర్మానించిన కళ్యాణ మండపంను మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమం అనంతరం, భక్తులకు మధ్య, పెద్ద బండ లాగు పోటీలలో, వృషభ రాశి రాజము కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా పరిషత్ చైర్మన్, ముత్యాల రామ గోవిందా రెడ్డి, మొదటి బహుమతిని, సురేందర్ రెడ్డి కి లక్ష 116 రూపాయలు అందజేశారు రెండో బహుమతి,మార్తెల చంద్ర ఓబుల రెడ్డి కి , 70,116 రూపాయలను, రామ సుబ్బారెడ్డి, ఆలయం మఠాధిపతులు, చేతుల మీదుగా అందజేశారు, మూడు బహుమతి, శివ కృష్ణ యాదవ్ కల్లూరు, బహుమతిని అందజేసిన, కొనకొండు ఆచారి కొండయ్య సన్స్ బహుమతి,45,116, రూపాయలను అందజేశారు .నాలుగో బహుమతి దూదేకుల చాంద్ బాషా కు బసిరెడ్డి, దుగ్గిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఐదవ బహుమతి, 10,116 కుర్ర వెంకటేశ్వర్ యాదవ్ అదేవిధంగా రేలారే రేలా కార్యక్రమాన్ని చేపట్టారు అనంతరం కత్తిర పల్లె చెంచు రెడ్డి బసిరెడ్డి ఆలయ మఠాధిపతులు ఆధ్వర్యంలో కోదండ స్వామి నాట్యమండలి, ద్వారా చింతామణి భవాని సీను సత్య హరిశ్చంద్ర పూర్తి నాటకం ప్రదర్శన మహా ప్రసాదము చిన్న బండల ఎక్కువ దూరం లాగిన వృషభరాజములకు బహుమతులు మొదటి బహుమతి 30 వేల 16 రూపాయలు ముడమాల యాదవ సంఘం వారి చేతుల మీదుగా ద్వితీయ బహుమతి 20 వేల 16 రూపాయలు బసిరెడ్డి చెన్నారెడ్డి కుమారులు చంద్రమోహన్ రెడ్డి చిన్నాయపల్లె గ్రామం బిమఠం, తృతీయ బహుమతి,15,016 చిలమల సిద్దయ్య ముడమాల గ్రామం చతుర్థ బహుమతి 5,116 విశ్వబ్రాహ్మల అన్నదాన సత్రం పంచమి బహుమతి 4,116 కొరివి నరసింహారెడ్డి చిన్నాయపల్లి 20వ తేదీన ఉదయం తెల్లవారుజాము నుండి శ్రీ శ్రీ సిద్దయ్యస్వాముల వారి కుమారులు పెద్దపీరయ్య స్వాముల వారి ప్రత్యేక పూజలు కార్యక్రమాలతో రూపాయలను,కనపర్తి నాగిరెడ్డి కుమారులు రామసుబ్బారెడ్డి గొడ్లవీడు గ్రామం మరియు సిద్దయ్య స్వామి వారి ఆలయ మఠాధిపతులు బహుమతి 16 మునుముల గుండు ఎత్తే వారికి మొదటి బహుమతి, 2,500 జోకుపల్లె గ్రామస్తులు ద్వితీయ బహుమతి 2,116 ప దుగ్గిరెడ్డి జోకుపల్లి గ్రామం బిమఠం,తృతీయ బహుమతి 1,116 పందుగాయల రమణ జోకు పల్లె, గ్రామం బి మఠం 13మునుముల గుండు ఎత్తేన వారికి మొదటి బహుమతి, 2,0,116 బసిరెడ్డి పెంచల్ రెడ్డి, ద్వితీయ బహుమతులు, 1,5116 బేరి జనార్దన్ రెడ్డి చిన్నాయ పల్లె గ్రామ తృతీయ బహుమతి, 1,0,116 ముడుమల రమణారెడ్డి, ముడుమాల గ్రామం బిమఠం బహుమతులను అందజేస్తారు భక్తులకు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పుట్టా ఆనంద్,మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి తెలుగుదేశం జిల్లా ఉపాధ్యక్షులు, కానాల మల్లికార్జునరెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నేలటూరు పెద్దిరెడ్డి చిన్న ఓబుల రెడ్డి, బసిరెడ్డి దుగ్గిరెడ్డి, సుబ్బారెడ్డి, పాల్గొన్నారు,ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా మైదుకూరు డిఎస్పి, రాజేంద్రప్రసాద్ సీఐ శివ శంకర్ పర్యవేక్షణ బ్రహ్మంగారిమఠం ఎస్సై శివప్రసాద్ ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేశారు, భక్తుల కొరకు ప్రత్యేకంగా ఆర్టిసి బస్సు సౌకర్యాలను బద్వేల్ డిపో పోరుమామిళ్ల మైదుకూరు సిద్దయ్య స్వాముల వారి వరకు ఏర్పాటు చేశారు భక్తులకు ప్రత్యేకంగా చలవ పందిళ్ళు విద్యుత్ అలంకరణ దీపాలు తో ఏర్పాట్లు చేశారు

## శ్రీవాసవిమాత సత్రం కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల



- ఎన్నికల అధికారి సాదు ప్రతాప్ కుమార్

తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయ సత్రం కమిటి ఎన్నికల నోటిఫికేన్, ఎన్నికల అధికారి సాదు ప్రతాప్ విడుదల చేశారు. స్థానిక బోసురోడ్డులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం సత్రం కమిటీ ఎన్నికలకు ముహూర్తం ఖరారైన క్రమంలో శుక్రవారం ఆలయ ప్రాంగణంలో, ఎన్నికల అధికారి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికల అధికారి సాదు ప్రతాప్ కుమార్, పరిశీలకులు కొత్తమాసు రమేష్ బాబు, గ్రంధి జయరామ కృష్ణ లు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడంతో పాటు, ఆ వివరాలను వెల్లడించారు. ఏప్రిల్ 1, 2 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 4 వతేదీన ఉపసంహరణ, 5 న స్క్రూటినీ, తుది జాబితా ప్రకటన ఉంటుందన్నారు. ఏప్రిల్ 26వ తేదీ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4:00 వరకు ఎన్నికల ప్రక్రియ జరుగుతుందని సాధు ప్రతాప్ చెప్పారు. ఎన్నికలు సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో జరుగుతాయని, ప్రతి సభ్యుడు 16 మందికి ఓట్లు వేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అందరు సహకరించాలని కోరారు.

## మాచర్లలో 144 సెక్షన్.. హై అలర్ట్



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : పల్నాడు జిల్లా మాచర్లలో 144 సెక్షన్ అమలు కొనసాగుతోంది. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జైలు నుంచి విడుదలైన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమత్తమయ్యారు. పల్నాడు జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టారు.

మాచర్లకు పిన్నెల్లి వచ్చిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మాచర్లలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇక మాచర్ల నియోజకవర్గవ్యాప్తంగా 144 సెక్షన్‌ను అమలవుతోంది. శాంతిభద్రతల దృష్ట్యా ప్రజలు గుంపులుగా తిరగరాదని ఆదేశాలు జారీ చేశారు. ర్యాలీలకు కూడా అనుమతులు నిరాకరించారు. పిన్నెల్లి రాకతో ఆయన అభిమానులు, కార్యకర్తలు చేపట్టే ర్యాలీలు, ఊరేగింపులకు సైతం ఎలాంటి అనుమతి లేదని లేవన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు.

**98 రోజుల తర్వాత విడుదల**

కాగా గుండ్లపాడులో జరిగిన జంట హత్యల కేసులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. గురజాల కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయన విడుదల అయ్యారు. సుమారు 98 రోజుల పాటు నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా పిన్నెల్లి ఉన్నారు.

## శ్రీబాలాత్రిపుర సుందరీ మాతకు సామూహిక లక్ష మల్లెల అర్చన



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): జగద్గురు శంకరాచార్య మహా పీఠపాలిత ఆలయం శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ చంద్ర మౌళేశ్వరుని ఆలయంలో మహిళా భక్తులు,సామూహికంగా అమ్మవారికి భక్తిమీర లక్ష మల్లెల అర్చనలు చేశారు. స్థానిక మారీస్ పేటలోని,శ్రీ చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలొ శు క్రవారం, శ్రీ లలితా పారాయణ మహిళా సంఘం, 33వ, వార్షికోత్సవ ఆధ్యాత్మిక వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుల ఆద్వర్యంలొ అమ్మవారికి పంచామృత స్నానం, విశేష అర్చనలు, నిర్వహించిన అనంతరం, గోవర్ధన సుశీల ఆధ్వర్యంలొ మహిళా భక్తులచే, లక్షమల్లెల అర్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ పాలక మండలి కార్యవర్గం గ్రంధి సేతుమాధవరావు, పొన్నూరు శశిధర్, వరదా వెంకటశేషగిరిరావు, అంకమ్మరాజు, తాడిపర్తిహరి తదితరులు పర్యవేక్షించారు. పూజల అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.



INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?

అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి

సర్క్యులేషన్ మేనేజర్

76 61 80 59 68

## జాబ్ క్యాలెండర్ విడుదలపై పీవీఎన్ మాధవ్ హర్షం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** నూతన తెలుగు సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ హర్షం వ్యక్తం చేశారు. గ్రూప్-1, గ్రూప్-2, ఇంజనీరింగ్, టీచింగ్, యూనిఫాం సర్వీసెస్ పోస్టులతో కలిపి మొత్తం 10,060 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి క్యాలెండర్ విడుదల చేయడం ఆనందదాయకమని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం దశలవారీగా ఉపాధి అవకాశాలను అమలు చేస్తోందని, యువతకు ఇది మంచి అవకాశం అని తెలిపారు. రాష్ట్ర యువతకు ఉత్తేజాన్ని అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. యువతకు అవకాశాలు కల్పిస్తూ వారి ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయం రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని మాధవ్ అభిప్రాయపడ్డారు. ఉద్యోగార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## దేవరపల్లి సురేష్ బాబుకు ఉగాది పురస్కారం



○ **సమాజహిత కార్యక్రమాలకు గుర్తింపుగా ఉగాది విశిష్ట స్ఫూర్తి రత్న పురస్కారం**

**చల్లపల్లి (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబుకు ఉగాది పురస్కారం లభించింది.ఒంగోలు కు చెందిన నేచర్ ఫౌండేషన్ మరియు సంస్కార భారతి ఆధ్వర్యంలో ఒంగోలు లోని శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి కళ్యాణమంటపంలో జరిగిన ఉగాది మహోత్సవ కార్యక్రమంలో సురేష్ బాబు కు ఈ పురస్కారాన్ని చెన్న కేశవ ఆలయ ఈఓ రావెళ్ల శివ శంకర్,నిర్వాహకులు డి. రాజ శేఖర్, గుర్రం సత్యం,కరుణాకర్,ధర్మవరపు శ్రీని వాసులు ఆధ్వర్యంలో అందచేశారు. సురేష్ బాబు పలు సామాజిక చైతన్య కార్యక్రమాల నిర్వహణ,నిరుపేదల యొక్క సమస్యల పట్ల స్పందించటం లాంటి అంశాలలో చురుకుగా వుంటారు.సంచార జాతి కుటుంబాలలో చదువు పట్ల అవగాహన కలిగిస్తూ వారి కుటుంబాలకు చెందిన పలువురు విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించారు. నిరుపేద విద్యార్థుల చదువుల కొరకు చేయూతనివ్వడం, దయనీయ స్థితిలో జీవనం సాగించే ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యల పట్ల తక్షణమే స్పందిస్తూ పరిష్కారానికి కృషి చేయడం,ఓటు హక్కు పట్ల అవగాహన కార్యక్రమాల నిర్వహణలో తనవంతు పాత్ర పోషిస్తున్నారు.అసోసియేషన్ దృష్టికి వచ్చే పలుఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు తన వంతు కృషి చేస్తున్నారు. సురేష్ బాబు ఉగాది పురస్కారం అందుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## యువతకు ఉద్యోగాల పండుగ : మంత్రి లోకేష్‌కు బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ ధన్యవాదాలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర నిరుద్యోగ యువతకు ఉగాది కానుకగా 10,060 పోస్టుల భర్తీకి "ఉద్యోగాల పండుగ" ప్రకటించిన విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌కు ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు పోలాకి శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌పై ఆయన హర్షం వ్యక్తం చేశారు.
ప్రకటించిన ఉద్యోగాలను నాలుగు విడతల్లో భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం అభినందనీయమన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి సంవత్సరం ఉగాది రోజున జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని మంత్రి లోకేష్ చెప్పడం సంతోషకరమన్నారు.
ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షిస్తూ ఉద్యోగావకాశాలు పెంచడమే కాకుండా, ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోస్టులను భర్తీ చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నందుకు లోకేష్‌ను అభినందించారు. జాబ్ క్యాలెండర్‌లో నోటిఫికేషన్ తేదీలను స్పష్టంగా ప్రకటించడంతో ప్రభుత్వ ఉద్యోగాల ఆశావహుల్లో ఆనందం వెల్లివిరిసిందన్నారు. మే 15న ఉన్నత విద్యాశాఖకు చెందిన 1,500 విశ్వవిద్యాలయ అధ్యాపక పోస్టులకు, ఆగస్టు 15న 91 గ్రూప్-1 పోస్టులు, హోంశాఖలో 2,778, ఇతర శాఖల్లో 928 పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల కానున్నాయని తెలిపారు. సెప్టెంబర్ 15న 750 గ్రూప్-2, 503 ఏఈఈ, ఇతర 506 పోస్టులు, అక్టోబర్ 15న పాఠశాల మరియు ఇంటర్మీడియట్ విద్యాశాఖకు చెందిన 3,004 పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న 1,711 జూనియర్ లైన్మెన్, 800 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, 7,142 ఇతర పోస్టులను భర్తీ చేసి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

## 22న విజయవాడలో శాలివాహన చక్రవర్తి- కవయిత్రి మొల్ల సాంస్కృతిక వైభవం

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మార్చి 22న శాలివాహన చక్రవర్తి, కవయిత్రి మొల్ల సాంస్కృతిక వైభవం కార్యక్రమాన్ని నగరంలోని వెన్యూ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. టెర్రకోట ప్రదర్శనలు, కుమ్మరి ఉత్పత్తుల ప్రదర్శన-అమ్మకాలు ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సాయంత్రం 3 గంటలకు మహాసభ నిర్వహించబడుతుంది. ఈ సభలో కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, కుల పెద్దలు, వివిధ నాయకులు అతిథులుగా పాల్గొననున్నారు.
రాష్ట్ర వ్యాప్తంగా కుమ్మరి, శాలివాహన సంఘాల నాయకులు, కుల పెద్దలు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీశ్రీనివాస్ పిలుపునిచ్చారు.

## గోదావరిలో విద్యార్థుల గల్లంతుపై సీఎం చంద్రబాబు ఆరా

○ **ఘటనపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** పోలవరం జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం రేవు వద్ద గోదావరిలో విద్యార్థుల గల్లంతుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. ఘటనపై అధికారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. స్నానం చేసేందుకు ఏడుగురు విద్యార్థులు గోదావరిలోకి దిగారని, వారిలో ఐదుగురు గల్లంతయ్యారని అధికారులు వివరించారు. గల్లంతైన వారిలో అభిరామ్, శ్రీకర్, నవదీప్ అనే విద్యార్థులు ముగ్గురు మృతి చెందారని, మిగిలి ఇద్దరు విద్యార్థులైన సతీష్ కుమార్, తేజ ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దీపక్, హర్ష ప్రాణాలతో బయటపడ్డారని వివరించారు. విద్యార్థులంతా అమరావతిలోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీకి చెందిన వారని తెలిపారు. ఆచూకీ లభ్యం కాని ఇద్దరు విద్యార్థుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని సీఎం ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు.

## ప్రజా సౌకర్యమే నా ప్రాధాన్యత : స్పెషల్ ఆఫీసర్ డా. జి. లక్ష్మీశా



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడ నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్‌గా డా.జి.లక్ష్మీశా శుక్రవారం ఉదయం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని స్పెషల్ ఆఫీసర్ చాంబర్‌లో శుక్రవారం దుర్గగుడి ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీఎంసీ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా వీఎంసీ స్పెషల్ ఆఫీసర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశా మాట్లాడుతూ ....
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తనను స్పెషల్ ఆఫీసర్ గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ నగరాన్ని సీఎం ఎప్పుడు "గేట్ వే టు అమరావతిగా" పేర్కొంటారని, అందుకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడం,ప్రజా సౌకర్యాలను విస్తరించడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం, విభాగాధిపతులతో సమావేశం నిర్వహించి, నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రాజెక్టులు, వివిధ కార్యక్రమాలపై సమీక్షించారు. నగరాభివృద్ధికి సంబంధించి ప్రాధాన్యత ఉన్న అంశాలను గుర్తించి, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు, ఇతర కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ సర్వేక్షణలో నగర స్థాయిని నిలుపుకోవడానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. తదుపరి, వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని వివిధ శాఖలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఈవో శీనా నాయక్, అడిషనల్ కమిషనర్లు డా. డి. చంద్రశేఖర్, ఎ. రవీంద్రరావు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా. కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ (ఇన్‌చార్జ్)పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సజన, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్, సూపరింటెండింగ్ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.విజయలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జె.శ్రీనివాస్,ఏ. శ్రీనివాసరెడ్డి, జి సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ గోపాల నాయక్, డాక్టర్ అన్నపూర్ణ, అసిస్టెంట్ కమిషనర్లు ఏ యు బి శర్మ, హెలెన్, డి ఎస్ ఎస్ శ్రీనివాస్ , బయాలజిస్ట్ కామేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, మేనేజర్ ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతికి ప్రాణం పోద్దాం - ఇంటింటా మొక్కలు నాటుదాం

○ **ఉగాది వారోత్సవాల్లో పిలుపు**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఉగాది వారోత్సవాల సందర్భంగా గుంటూరు నగరంలోని చంద్రమౌళేశ్వర అగ్రహారంలో నిర్వహించిన కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ కార్యక్రమాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. దేశప్రేమీ సేవా సంఘటన్ అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో జీఎంసీ 35వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఈరంటి వరప్రసాదబాబు, బీజేపీ రాష్ట్ర మీడియా కో-కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, శ్రీరామ శోభాయాత్ర కన్వీనర్ చల్లా బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
మొదటి రోజు భారతదేశ జాతీయ ఉత్సవాల విశిష్టతను, శ్రీరామ శోభాయాత్ర ప్రాముఖ్యతను నాయకులు ఇంటింటికీ వెళ్లి వివరించారు. రెండవ రోజు నగర సుందరీకరణలో భాగంగా దేవాలయ వీధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, మన దేశ పండుగల వెనుక ప్రకృతి ఆరాధన ఉందని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో మారుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్యాస్, పెట్రోల్ వినియోగంలో పొదుపు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పబ్లిసిటీ అండ్ లిటరేచర్ కన్వీనర్ పాలపాటి రవికుమార్, లోకసంఘర్ష్ నాయకులు మద్రి శంకరరావు, ఈమని మాధవరెడ్డి, బీజేపీ మండల నేతలు సిద్దా కాశీనాథ్, ఎంవీ రమణారెడ్డి, కడియాల శివాజీ, తమ్మా ప్రసాదరెడ్డి, గుండిమెడ శాస్త్రి, 47వ బూత్ అధ్యక్షుడు కోలవెన్ను శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ ఫైల్ ఎఫెక్ట్

### ప్రారంభమైన రోడ్డు మరమ్మత్తులు




జర్నలిస్ట్ ఫైల్
గుంతల మయం కొండపాటూరు రోడ్డు మార్గం

**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రసిద్ధి గాంచిన స్వయం భూ శ్రీ పోలేరమ్మ తిరునాళ్ల ఈ ఏడాది ఏప్రిల్ 7 వ తేదీన జరగనున్న నేపద్యం లో పూర్తిగా దెబ్బ తిన్న రోడ్ల పరిస్థితుల గూర్చి జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక లో గుంతల మయం లికొండపాటూరు రోడ్డు మార్గంలి అను శీర్షికన ప్రత్యేక వార్త కథనం ప్రచురించడం జరిగింది. రోడ్డు సమస్య గూర్చి స్థానిక ప్రత్తిపాడు నియోజకవర్గం శాసనసభ్యులు డా బూర్ల రామాంజనేయులు ప్రత్యేక చొరవ చూపి జిల్లా పరిషత్, మండల పరిషత్ నుండి కేటాయించిన నిధులతో కొండపాటూరు నుండి అప్పాపురం వం- కు,కాకుమాను నుండి కొండపాటూరు వరకు రోడ్డు మరమ్మతుల కొరకు కేటాయించినారు.వీటికి సంబంధించిన పనులను శుక్రవారం నాడు ప్రారంభించారు. ఎమ్మెల్యే కృషి కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఎట్టకేలకు రోడ్డు మరమ్మతుల పనులు ప్రారంభించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మోహన రంగనాయక స్వామి దేవస్థానంలో ఘనంగా పంచాంగ శ్రవణం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** స్వస్తి శ్రీ పరాభవ నామ నూతన సంవత్సరం ఉగాది సందర్భంగా నగరంలోని రాజ్యలక్ష్మి గోదాదేవి సమేత మోహన రంగనాయక స్వామి దేవస్థానంలో పంచాంగ శ్రవణం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన అడ్వాన్స్ పి.జి.డీ ఇన్ వేదిక్ ఆస్ట్రాలజీ విద్యార్హత కలిగిన రాజవరపు వేణుగోపాల్ పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు పరాశరం సత్యనారాయణాచార్య, ఆలయ అనువంశిక ధర్మకర్త దేశరాజు పట్టాభి రామచంద్రమూర్తి, పాలకవర్గ సభ్యులు, స్వామి సేవా సమాజం సభ్యులు పాల్గొన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ పంచాంగ శ్రవణంలో భక్తులు విరివిగా హాజరై శ్రద్ధగా వినిపించుకున్నారు. అనంతరం స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీర్వాదాలు పొందారు.

## కొండపాటూరు జడ్పీ హై స్కూల్ నిర్మాణానికి కోటి డిపాజిట్

○ **కాటూరి సుబ్బారావు ధాతృత్వం**

○ **గ్రామభివృద్ధి కి నేను సైతం అంటున్న కె ఎం సి హాస్పిటల్ అధినేత**

○ **గ్రామ ప్రజల హర్షం**



**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండపాటూరు హైస్కూలు భవన నిర్మాణానికి కాటూరి మెడికల్ కాలేజీ హాస్పిటల్ అధినేత కాటూరి సుబ్బారావు కోటి రూపాయలను ఈ హైస్కూల్ పేరుతో డిపాజిట్ చేయడం శుభపరిణామమని మండల విద్యా శాఖ అధికారులు కెన్నడి, విజయభాస్కర్ లు ప్రశంసించారు. దీన్ని పురస్కరించుకుని సుబ్బారావుకు ధన్యవాదాలు తెలిపేందుకు శుక్రవారం వీరు హైస్కూలుకు వచ్చి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది హైస్కూలుగా అప్ గ్రేడ్ అయిన ఈ పాఠశాలకు పూర్వ విద్యార్థిగా, జన్మభూమి రుణం తీర్చుకోవడంలో భాగంగా ఈ హైస్కూలు భవనం నిర్మించడానికి సహకరించిన దాత సుబ్బారావుకు అభినందనలు తెలిపారు. తమ పరిధిలో ఉన్న కొండపాటూరు హైస్కూలు ప్రతి విషయంలోను ముందుంటుందని, విద్యార్థులు జిల్లా స్థాయిలో రాణిస్తున్నారని, సుబ్బారావు హైస్కూలు భవనం నిర్మిస్తున్నందున దీనికి మహర్దశ ఖాయంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచే పదో తరగతిలోకి ప్రవేశించే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు వేసవి సెలవుల్లో కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. కొత్తగా హైస్కూలు అయినందున అత్యున్నతి ఫలితాలు సాధించి ఈ హైస్కూలు పేరు నిలబెట్టాలని వారు ఉపాధ్యాయులకు సూచించారు. తొమ్మిదో తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలను వారు ప్రశ్నలడిగి తెలుసుకుని వారిని అభినందించారు. ఇతర గ్రామాలకు వెళ్లి చదువుకునేవారు వచ్చే విద్యా సంవత్సరంలో ఈ హైస్కూల్లో చేరే విధంగా ఏప్రిల్ నెలలో ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించేందుకు తామిద్దరం కూడా పాల్గొంటామని హామీ ఇచ్చారు. సుబ్బారావు నిర్మించే హైస్కూలు స్థలాన్ని కెన్నడి, విజయభాస్కర్ లు పరిశీలించారు. ఆయన పంపిన భవనం నమూనా ప్రకారం స్థలం సరిపోతుందని వివరించారు. గ్రామ పెద్ద టీడీ ప్రసాద్ మాట్లాడుతూ హైస్కూలు పేరుతో కోటి రూపాయలు డిపాజిట్ చేసిన మిత్రుడు కాటూరి సుబ్బారావుకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన నిర్మించబోయే హైస్కూలు భవనం నమూనా అందరికీ ఆమోదయోగ్యంగా ఉందని పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి దాన్ని పూర్తి చేయడానికి గ్రామస్తులు ఐక్యంగా సహకరించాలని సుబ్బారావు కోరారని చెప్పారు.

**మరో రెండు నిర్మాణాలకు సహకారం**

కొత్తగా నిర్మించే హైస్కూలు పక్కనే గల కమ్యూనిటీ హెల్త్ సెంటరును కూడా రూ. ఐదు లక్షలతో మరమ్మతులు చేయించి తమ కాటూరి మెడికల్ కాలేజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో పని చేసేలా డాక్టరును, సిబ్బందిని నియమిస్తానని దాత కాటూరి సుబ్బారావు వెల్లడించారని తెలిపారు. అలాగే ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాలును కూడా తమ సొంత నిధులతో నిర్మించి ఇస్తానని దాని పర్యవేక్షణ బాధ్యతలు తరిగోపుల సూరిబాబుకు అప్పగించారని చెప్పారు. వెనుకబడిన కొండపాటూరు గ్రామానికి తన వంతు బాధ్యతగా శ్రద్ధచూపి సహకరిస్తున్న కొండపాటూరు శ్రీమంతుడు కాటూరి సుబ్బారావుకు హైస్కూలు భవన నిర్మాణం చేపట్టడానికి సహకరిస్తున్న కాటూరి సుబ్బారావుకు తన తరఫున, గ్రామస్తుల తరఫున ప్రసాద్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. హైస్కూలు భవనం నిర్మాణానికి గ్రామస్తులు ఐక్యంగా సహకారం అందజేస్తారని ఈ సందర్భంగా సుబ్బారావుకు గ్రామ పెద్ద గన్నమనేని రాఘవరావు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల కెరీర్ గైడెన్స్, హెల్త్ కౌన్సిలర్ ఎన్. ప్యారీ జాన్, పాఠశాల ఉపాధ్యాయులు హైస్కూలు భవన దాత సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## 26 వేలకోట్లతో శాశ్వతం నీటి సమస్య పరిష్కారం : చీఫ్ విప్ జీవీ, ఎంపీ లావు

○ **జలజీవన్ మిషన్( జీజీవీ) ద్వారా ప్రతి ఇంటికి త్రాగునీటి కొళాయి**

○ **వేలకోట్లు దోచుకున్న వైసీపీ**

○ **అభివృద్ధిలో దూసుకు వెళ్తున్న కూటమి ప్రభుత్వం**

○ **పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన చీఫ్ విప్ జీవీ, ఎంపీ లావు**



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో త్రాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం జల జీవన్ మిషన్ (జీజీవీ) ద్వారా 26 వేల కోట్లు ఖర్చు చేస్తుందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు తెలిపారు. పల్నాడు జిల్లాలోని వినుకొండ నియోజకవర్గం ఈపూరు మండలంలోని పలు గ్రామాల్లో పూర్తిచేసిన అభివృద్ధి పనులను వారు ప్రారంభించారు. అనంతరం చిట్టాపురం గ్రామంలో రాజ్యసభ సభ్యులు కృష్ణయ్య కేటాయించిన 20 లక్షలు నిధులు ద్వారా నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ వాళ్లను వారు ప్రారంభించి అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఇంటింటికి త్రాగునీటి కులాయి ఏర్పాటుచేసి సురక్షితమైన త్రాగునీరు అందిస్తామని తెలిపారు. జల జీవన్ మిషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి కులాయి కనెక్షన్లు ఇవ్వడం జరుగుతుందని, దానిలో భాగంగానే పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం ప్రతి గ్రామంలో ఇంటింటికి కులాయి ఏర్పాటు చేసి స్వచ్ఛమైన త్రాగునీరం ఇవ్వటం జరుగుతుందని, ఏడాదిలో పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. గ్రామ సీమలను అభివృద్ధి చేసే బాధ్యత సీఎం చంద్రబాబు నాయుడు పంచాయతీరాజ్ మంత్రి పవన్ కళ్యాణ్ కు అప్పగించగా 4500 కోట్లతో 3000 గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి లో దూసుకుపోతుందన్నారు. 23 లక్షల కోట్లు రాష్ట్రానిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని, దీని ద్వారా 25 లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయన్నారు. గత వైసిపి దోపిడి పాలనతో ఉన్న పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయాయని, మద్యం ఇసుక లాంటి కుంభకోణాలతో రాష్ట్రాన్ని లూటీ చేయటం వలన పాలించే అర్హత లేదని ప్రజలు వైసీపీని తరిమికొట్టారన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసి సంక్షేమ పథకాల అమలు చేస్తూ ప్రజలను ఆదుకోవడం జరుగుతుందన్నారు. వైసీపీ పాలనలో రైతులను నట్టేట ముంచారని, ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 1600 కోట్లు ధాన్యం రైతులకు చెల్లించడం జరిగిందన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, పలు అభివృద్ధి పనులు చేపడుతూ గ్రామాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కూటమి ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ఆయా గ్రామాల పెద్దలు, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గోపువారిపాలెం గ్రామంలో 32 లక్షల వ్యయం నూతనంగా నిర్మించిన పంచాయితీ భవనాన్ని ప్రారంభించారు. అలాగే అదే గ్రామంలో 10 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. గుండె పల్లి గ్రామంలో 10 లక్షల రూపాయలతో నిర్మాణం చేపట్టిన సిసి రోడ్డును ప్రారంభించారు. బొగ్గరం గ్రామంలో 1.40 కోట్లతో నిర్మించిన చిట్టాపురం - బొగ్గరం లింకు రోడ్డును ప్రారంభించారు. గోపువారి పాలెం గ్రామంలో సర్పంచ్ శ్రీనివాసరావు, యువత ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467